# శ్రీ సింహాద్రి నారసింహ శతకము



శ్రీ సింహాచల దేవస్థానమువారిచే
ప్రచురింపబడినది

వెల 70 న.పై.

శ్రీ ర స్తు

# శ్రీ సింహాద్రి నారసింహ శతకము

27. x. 48

సాహిత్యాచార్య, కవిశేఖర

**శ్రీ పంతుల లక్ష్మీనారాయణశాస్త్రిచే**

పరిష్కృతము

శ్రీ సింహాచల దేవస్థానమువారిచే

ప్రకటితము

1962

## శ్రీ గోగులపాటి కూర్మనాథకవి విరచితము

T.S.R. Anjaneyulu
M.Phil (class)

# పరిచయము

సింహాద్రి నారసింహశతకము, గోగులపాటి, కూర్మనాథ కవి రచించెను. ఇయ్యది రచియించుటకు, చారిత్రిక కారణ మొండు కలదు. ఆ విషయము నెరింగించుటకుఁ బూర్వము, కవి జీవితమును గూర్చి, కొంత ముచ్చటించుట యవసరము.

గోగులపాటి కూర్మనాథకవి, యారువేల నియోగి బ్రాహ్మణుడు, ఆపస్తంబ సూత్రుఁడు. గౌరమాంబకును, బుచ్చనకును బుత్రుడు. సూరనార్యుని పౌత్రుడు. వెంకన్న, కామన్నలను, తమ్ములీయనకు గలరు. ఈతడు నేటి విజయనగరము తాలూకాకు చెందియున్న రామతీర్థ గ్రామవాస్తవ్యులగు, శ్రీతిరుమల పెద్దింటి, సంపత్కుమార, వేఙ్కటాచార్యులవారి శిష్యుడు. ఈ విషయములను కవియే తన మృత్యుంజయ విలాసమను యక్షగానమందిట్లు వ్రాసుకొని యున్నాడు.

ద్విపద :- "సలలిత పెద్దింటి సంపత్కుమార
శ్రీ వేంకటార్య దేశికుల శిష్యుండ
పావన గౌరమాంబా బుచ్చన మంత్రి
వర పుత్రుఁడను సూరవరుని పౌత్రుండ ॥

ఈ శతకాంత సీసపద్యమును కూడ నిటులనే చెప్పి యున్నాఁడు.

ఈయన సుమారు క్రీ॥ శ॥ 1720 సం॥ ర॥ ప్రాంతమున జన్మించినట్లు, శ్రీ అడిదము రామారావు గారిచే రచించబడిన విస్మృత కళింగాంధ్ర కవుల చరిత్రయందు వ్రాయఁబడినది.

ఈయన నివాసస్థల మేదియో సరిగాఁ దెలియదు గాని బాల్యావస్థ యంతయు, రామతీర్థ గ్రామమునందే గడిపినట్లు తోచెడిని. అచటనే విద్యాభ్యాసము పూర్తి గావించి పాండి

త్యము సంపాదించి యుండవచ్చును. పిమ్మట విజయనగర సంస్థాన దేవస్థాన శాఖయం దుద్యోగిగా నుండి, రామతీర్థము, పద్మనాభము, సింహాచలము, శ్రీ కూర్మము మొదలగు స్థలములలో నున్నట్లు చరిత్రవలనఁ దెలియు చున్నది.

ఈయన చరమావస్థ యందు గజపతి నగరము (విశాఖజిల్లా) దరినున్న దేవులపల్లి గ్రామమున నివసించినట్లు తోఁచెడిని. నేటికిని ఆ గ్రామమందలి దేవాలయ సమీపస్థలము గోగులపాటివారి నివేశన మని పిలువఁబడుచున్నది.

అచ్చట నుండగనే యీయన మృత్యుంజయ విలాసమను యక్షగానమును చెప్పినట్లీ క్రింది పద్యము వలనఁ దెలియుచున్నది.

గీ. "పరమ భక్తుండు గోగులపాటి కూర్మ
మంత్రి మృత్యుంజయవిలాస మధుర కావ్య
మొనర రచియింప సన్నిధినుండి వ్రాసె
ధరణి నాదుర్తి హరిహరదాస ఘనుడు॥"

ఆదుర్తి హరిహరదాసు దేవులపల్లి వాస్తవ్యుడు. నేటికిని ఆ గ్రామమందు వారి కుటుంబీకులు కలరు. గోగులపాటి కూర్మనాథ కవి మొదటి యానందగజపతి మహారాజు యాస్థానమందు ఆస్థానకవిగా నుండి మృత్యుంజయ విలాసమను నీ యక్షగానమును రచియించి ఆమహారాజునకు కృతి యొసంగెను.

(See Page 80 of Vizagapatam District Manual)

ఈ కవి (1) మృత్యుంజయవిలాసమను యక్షగానము (2) సింహాద్రినారసింహ శతకము (3) లక్ష్మీనారాయణ సంవాదమను ప్రబంధము (4) సుందరీమణి శతకమును వ్రాసి యుండెను. అందు చివరిది అముద్రిత గ్రంథము. సుందరీమణి శతకము వ్రాతప్రతి ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమం దున్నదిగాని సంపూర్ణముగ లేదు.



అందు నెనుబది పద్యములు మాత్ర మున్నట్లు శ్రీ నిడదవోలు వెంకటరావుగారు వ్రాసి యున్నారు. అందుండి మచ్చున కొక పద్యము నిందు పొందుపరచుచున్నాను.

ఉ॥ "సరసములాడునేర్పు కనుసైగలు జేసెడినేర్పు నా మనం
బెరిగెడినేర్పు, నెమ్మదినొకించుక కోపము సేయునేర్పు, క్ర
మ్మర మురిపెంబుతోడ బ్రతిమాలెడి నేర్పు మనోజుకేళిలో
గరగెడినేర్పు నీకెతగుగాదె తలంపగ సుందరీమణీ॥"

ఈ కవి సుమారు క్రీ. శ. 1790 సం॥ రములో దేవులపల్లి గ్రామములోనే పరమపదించినట్లు చారిత్రకు లూహించుచున్నారు. అడిదము సూరకవి, చట్రాతి లక్ష్మీనృసింహకవి యీయన సమకాలికులు.

### శతకము రచించుటకు గల కారణము

క్రీ. శ. 1753 సం॥ ర మున దక్కను సుబేదారగు సలాబట్ జంగ్ ఉత్తరసర్కార్లు బుస్సీకి కౌలునకొసంగెను. కౌలుకు తీసికొనిన ఉత్తరసర్కార్లు స్వాధీనపరచుకొనుటకు, పరాసు "బుస్సీ" మచిలీ పట్టణమునకు గవర్నరగు "మారిసన్" అనునతనిని రాజమహేంద్ర వర శ్రీకాకుళ సర్కారులకు బంపెను. కాని శ్రీకాకుళములో పౌజు దారు (Governor) గానున్న "జాఫరల్లీఖాను" నకీ విషయ మిష్టములేదు. అందుచే బలవంతుడగు "విజయరామ గజపతి" తో సంధి చేసికొని ఆయన సహాయమువలన శ్రీకాకుళము, రాజమహేం ద్రవర సర్కార్లు స్వాధీనము చేసికొని ఏకచ్ఛత్రాధిపత్యముగ నా సర్కారుల నేలఁదలచెను.

"మారిసన్" ఈ విషయము నెట్లో గ్రహించి ముందుగనే తాను "విజయరామ గజపతి" తో సంధిని జేసుకొనెను. "జాఫరల్లీ" యీ విషయ మెఱింగి శ్రీకాకుళమును విడిచి పారిపోయెను. కాని

"జాఫరలీ" విజయరామగజపతి పైనను ఫ్రెంచివారిపైనను పగసాధింపనెంచి అప్పటికి ఫ్రెంచివారితో యుద్ధము చేయుచున్న నాగపురాధీశ్వరుడైన "రగోజీభొంస్లే" అను మహారాష్ట్రనాయకుని యొద్దకు పయనమై పశ్చిమ మార్గమున బోవుచుండ మార్గమధ్యమున సేనాసమేతుడై బోవుచున్న రగోజీ కుమారుడు కనపడెను. అంతట "జాఫరలీ" అతనిని బ్రతిమాలి ఆ సైన్యముతో శ్రీకాకుళము సర్కారునకు కొండల మీదుగా రమ్మనియెను. అంతట నా సైన్యమందలి కొంత గుఱ్ఱపు దళము కొండల మీదుగా పయనమై వచ్చెను. ఆ కొండమార్గమును జూపుటకు పాచిపెంట జమీందారగు "వీరప్పదొర" వారికి దోడ్పడెను. (విశాఖమండలిచరిత్ర Page 64 to 67) అందు మహారాష్ట్రులును, తురకలును గలరు. మహారాష్ట్రులు గ్రామములు దోచుకొనుచుండ తురకలు దేవళములు పడగొట్టనారంభించిరి. అప్పటికి విజయరామ గజపతి యజాగ్రతగ నుండుటచే తన సైన్యముతో వారల నెదుర్కొనియు తిరోహితుడు గావలసి వచ్చెను.

క్రమముగా సైన్యము సింహాచలమునకు జేరుచుండెను. అవ్వార్త నెఱింగి దేవస్థానోద్యోగులును, భక్తులును అగు "ఆదుర్తి హరిహరదాసు," "గోగులపాటి కూర్మదాసు" అనువారిరువురును స్నానమాచరించి, దేవళము గర్భగుడిలో బ్రవేశించి తలుపులు మూసికొని ఈశతకరచనకు గడంగిరి. "గోగులపాటి కూర్మన్న ఆశువున నీశతకముం జెప్పుచుండ తిరిగి యడుగకుండ గంటమూని తాటియాకులపై హరిహరదాసు వ్రాసెను. మున్ముందు శతకము దూషణ తిరస్కారములతో నారంభమయి పిమ్మట క్షమాపణలతోను ప్రార్థనలతోను ముగిసినది. తురక దండు కొండపైకెక్కి కట్టడములు పాడొనర్ప నారంభించెను. క్రమముగా దేవుని కల్యాణ మండపము జొచ్చి అవకాశమున్నంతవరకచ్చటి కట్టడములు పాడొనర్చి గుడి యావరణలోనికి ప్రవేశించి అచ్చట రాతిరథము లందుగల గుఱ్ఱములు



మొదలగు వానిని కొన్నింటిని భగ్నమొనర్చి, ముఖ్యాలయ ప్రదేశమునకు గడంగు నంతలో కంచు తుమ్మెదలుద్భవించి యివ్వారిని వెంటనంటి సంహరింపం జొచ్చెను. వారును కాలుకొలది బర్వెడిరి గాని తుమ్మెదలు వారిని విశాఖపట్టణ సమీపమందుగల తుమ్మెదల మెట్టవరకును వెంటనంటి పిమ్మట యంతర్ధాన మైనవి. ఆ విషయమీ శతకము నందలి క్రింది పద్యమువలన విశదమగును.

గీ॥ "అరుల బరిమార్చి వైశా పురసమీప
గిరి బిలంబున డాగె బంభరములెల్ల
అది మొదలు తుమ్మెదల మెట్ట యండ్రు దాని
వైరి హర రంహ సింహాద్రి నారసింహ"

పై పద్యము కూర్మనాథ కవి రచన గాదని తోచెడిని.

అంతట విజయరామ గజపతి సైన్యమును సక్రమముగ సమకూర్చుకొని రగోజీ సైన్యములను అనకాపల్లి దరి తుమ్మపాలవద్ద నెదిరించి ఓడించి సింహాచలము విచ్చేసెను. వచ్చునపుడు త్రోవంబడిన యశ్వముల యొక్కయు యాశ్వికుల యొక్కయు మృతకళేబరంబులం గాంచి సింహాచలముం జేరి విషయమంతయు నెఱింగి శతకము నాశువున చెప్పినందులకు కూర్మనాథునకు రామతీర్థము దరి నొక యగ్రహారము, శతకము తిరిగి యడుగకుండ వ్రాసినందులకు హరిహరదాసునకు కొత్తవలస దరినున్న "నిమ్మల పాలెమను" నగ్రహారమును ధార వోసెను. (See Feezo Committee accounts of the respective villages prepared in A. D. 1835) నేటికిని హరిహరదాసు కుటుంబీకులకు దేవుని కల్యాణమందు నాలగవ దినమునం గొంత సొమ్మిచ్చు రివాజు గలదు.

ఈశతకమందలి కవిత్వము నిరర్గళధారా ప్రవాహ సదృశంబై యొప్పుచు సంస్కృతాంధ్రములయందీ కవికిగల యసమాన పాండిత్యము వేనోళ్ళ జాటుచున్నది. అట్లని కవిత నారికేళపాకంబునం

బడక కదళీపాకమునందే నడచినది. ఇందు పెక్కుసామెతలును ఉర్దు మాటలునుగూడ గలవు. తురకమాటలు తెలుగుతో కలిసి సీసములందుఁ జొన్పుట యీకవికిగల కవితా నైపుణ్యమును విదితముఁ జేయుచున్నది. శతకము జదువుటవలన జదువరులానాటి రాజకీయ, సాంఘిక, ఆర్థికాది విషయముల నెఱుంగుటయేగాక ఆనాటికి సింహాచల దేవస్థానమునకు గలప్రాశస్త్యములు. ఆలయ నిర్మాణాది కౌశలమును గ్రహింపనగును. సింహాచల స్వామికి " యజ్ఞ వరాహ స్వామి " యనిపేరు. భగవంతునకు వరాహ రూపమున హిరణ్యాక్షునితో పోరొనర్చిన సందర్భమున హిరణ్యాక్షునివలన బల్లెపు పోటు గలిగెనని పురాణప్రతీతి. ఆపోటింకను యజ్ఞవరాహామూర్తికి ప్రక్కలోగలదని ప్రజలు నేటికిని చెప్పుకొనుచుందురు. ఆవిషయమునే నీకవి

" నిబిడ యవనుల భయశంక నీవునింక  
వైకి నగపడకున్న నీప్రక్కనున్న  
గాయ మిప్పటికిని మానదాయె నయయొ ?"

అని దృఢపరచినాడు. ఇటులెన్నియో యుదాహృత విషయము లున్నవి గాని గ్రంథవిస్తర భీతిచే విరమించుచున్నాను. ఈశతకమష్టోత్తరశత పద్యములు గలదియే యైనను ఏకోత్తర శత పద్యములే లభించినవి. కడమపద్యములు లభ్యము కాలేదు. దొరకినచో ద్వితీయముద్రణమందు చేర్చబడును.

ఈ శతకము నితర ప్రచురణల ననుసరించి, శుద్ధప్రతి తయారు చేసియు, " తొలిపలుకు " రచించియు, తమ యమూల్యావకాశము వినియోగించిన " శ్రీ పంతుల లక్ష్మీనారాయణశాస్త్రి " వారికి ధన్యవాదములు.

సింహాచలము. దాట్ల లక్ష్మీనరసింహరాజు, B.A  
ఎగ్జిక్యూటివు ఆఫీసర్.

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

## తొలిపలుకు

[ శ్రీ కూర్మదాస మహాకవి రచనా విశిష్టత ]

" వైరి హారరంహా! సింహాద్రి నారసింహా! " అను శీర్షికను గలిగి యుండుట వలనను, 101 పద్యములను గలిగి యుండుట వలనను, ఈ ఖండకృతికి ' సింహాద్రినారసింహాశతక ' మను పేరు కలిగినది. దీని రచయిత శ్రీ గోగులపాటి కూర్మదాస మహాకవి. లేఖకుడు - ఆదుర్తి హారి హార దాసు. ' వైరి హార రంహా ' అనగా, " శత్రువులను సంహరించు విషయమున వేగము గలవాడా " అనియర్థముగదా! శత్రువులు సింహాద్రిని ముట్టడించుటకు శరవేగమున వచ్చుచుండిన యాసమయమున ఈవేగ మత్యావశ్యకమగుట వలన నిందలి ప్రతి పద్యమునను ' సింహాచల నారసింహాఁ డిట్లు సంబోధింపఁ బడుట - అత్యధిక సముచితమై యున్నది.

సింహాచల దేవాలయమునకు యవనులు తురుష్కులు, పాశ్చాత్యులు మున్నగు శత్రువుల వలన ప్రబలమగు విపత్తు సంభవింపనున్న సమయమున భయోద్వేగ, భావోద్వేగ, భక్త్యుద్వేగములతో, గూడిన కూర్మదాస మహాకవి హృదయమునుండి - సింహాచలము నందలి గాంగధారనుబోలిన యీ కవితాధార - ఆశుధారా రూపమున వెలువడి, ఈ శతక రూపమును ధరించినది. కనుక తదితర శతకములందు గల కవితాధారలకంటె ఈ శతకము నందలి కవితాధార - అపూర్వమగు ధారావిశిష్టతను గలిగి యున్నది. కనుకనే సహృదయుఁడగు పాఠకుని మొదటినుండి తుది వరకును ఏకధారా వేగమున పఠింపఁ జేయునదిగా నున్నది. ప్రభువునకు దేనినైనను విన్నవించు

వాఁడు - తొలి వాక్యమున ఆప్రభువును సుముఖునిగాఁ జేసికొనవలెను. కనుక రసజ్ఞుఁడగు భగవంతుని తనకభిముఖునిగాఁ జేసికొనుటకు కూర్మదాసకవివరేణ్యుఁడు మొదటి పద్యమునందలి మొదటి పాదమ్మునసే "శ్రీ మద్రమారమణీ మణీరమణీయ సరస చిత్తాబ్జ బంధుర!" అని సంబోధించి, విపద్దశను గుర్తింపఁ జేయుటకు 'పరాకు' అని నుడివెను. దీని చేత భగవానుని హృదయము నాకర్షించుటకు వీలు కలుగుచున్నది. పద్యార్థమునంతను వినిన భగవంతునకు - దీనిచేతనే "రమారమణీ మణీరమణీయ సరసచిత్తాబ్జమును ఆస్వాదించుట కిది యదనుకా" దను నంశముధ్వనింప జేయఁబడుచున్నది. "సమయమాయిది కేళికా సౌఖ్యమునకు" అని 22వ పద్యమున నీవిషయము- వాచ్యముగనే తెలుపఁబడినది.

దీని యందలి రెండవ పాదమునందుఁ గల "శంఖ చక్రగదాసి...... దివ్యసాధనకర! పరాకు" అను సంబోధనమున శత్రు సంహారమున కుపయోగించు యుద్ధసాధనములు - నీహస్తమున, నెలకొనియే యున్నవనియు, అవి - దివ్యములు, కనుక అప్రతిహతములనియు, దీనితో శత్రువులను సంహరింపవలయుననియు, స్ఫురింపఁ జేయఁబడెను. మూడవ పాదమున "ప్రహ్లాద నారద ... ... భక్త సంరక్షణపర పరాకు" అను దానిచేత "నీవు భక్త సంరక్షణాసక్తవు. కనుక నీ భక్తులకు,గల్గు నీ మహా విపత్తును నీవే తొలగింపఁ బూనఁదగు" నను నంశము స్ఫురింపఁ జేయఁబడెను. నాల్గవ పాదము నందలి "బహుతర బ్రహ్మాండ భాండ పరంపరా భరణ లీలాదురంధర! పరాకు" అనుదానిచే "ఈ బ్రహ్మాండములు లెక్క లేనివిగను, తెంపు లేనివిగను, నున్నవి. ఒక్కొక్క బ్రహ్మాండమునందే పదునాల్గు లోకములున్నవి. అట్టి యొక్కొక్క బ్రహ్మాండము-నీ కొక్క భాండముగఁ దోచుచున్నది. అట్టి బ్రహ్మాండ భాండములను భరిం



చుట యనునది నీకొక లీలగా నున్నది. అటువంటి మహాలీలల నెన్నింటినో నీవు భరించుచున్నావు" అను వాచ్యార్థముచేత "అత్యల్పులగు నీశత్రువులను శిక్షించి, నీ యాలయమును రక్షించుకొనుట అను నీ కార్యము నీ కత్యల్పమగు లీల కాఁగల" దను నంశము స్ఫురింపఁజేయబడినది. ఇట్లు స్ఫురింపఁ జేయబడిన ఈ వస్తు ధ్వనులు-ప్రధానమగు భక్తి భావ ధ్వనియందు పర్యవసానము నొందుచున్నవి. కనుక నిది ప్రధానమగు భావధ్వని గల కావ్యమగుచున్నది. అలంకారికులు - దీనినే భావకవిత్వమందురు. ఇట్లే యిందలి పద్యములన్నియుఁగూడ భక్తి భావమునే ప్రధానముగ నిందు ధ్వనింపఁ జేయుచున్నవి. ఈ ప్రథమ పద్యమునందు సంగ్రహింపఁబడిన ఈ యర్థమే 67వ పద్యము వఱకును విపులీకరింపఁబడినది. ఈ శతకమునందలి పద్యములు పలు విధములగు వ్యంగ్యములకును, ధ్వనులకును, గనులుగా నున్నవి. అందుఁ గొన్నింటిని క్రింద వివరింతును. పాఠక సహృదయులు సమీక్షింతురుగాక !

2, 3, 4 సంఖ్యలు గల పద్యముల యందు క్రమముగా భగవానుని భోగలాలసత్వము, పరాక్రమాతిశయము, పరాక్రమ సంకోచము, స్ఫురింపఁ జేయఁబడినవి. ప్రధానముగా నుత్సాహ భావము - ధ్వనింపఁ జేయబడినది. 5వ పద్యము చేత స్ఫురింపఁ జేయబడిన కోపము 'అలుకరాదేల' అని యనువదింపఁబడి వాచ్యము చేయబడుట వలన గుణీభూత (అప్రధాన కృత) వ్యంగ్యమైనది. ఐనను "యవనులఁ ద్రుంచు మింక" అను ప్రబోధ వాక్యము చేత 'ఉత్సాహము' ధ్వనింపఁ జేయబడినది.

6వ పద్యమున రౌద్ర - శృంగార రసములు - స్ఫురింపఁ జేయబడినది. ఐనను దీనియందు ప్రధానముగా ధ్వనింపఁ జేయబడిన వీరరసమున కివి యంగము లగుటవలన నివి నిర్దుష్టము లగుచున్నవి.

7 వ పద్యమున "పొట్నూరు లోని కోదండ రామ మూర్తి యే పొదలలో డాగెనో, భీమసింగి లోని గోపాలమూర్తి యెక్కడి కేగెనో, జామిలోని జనార్దనస్వామి యెచ్చోటికి వెళ్ళెనో, చోడవరము లోని కేశవరామమూర్తి యెన్నిపాట్లు పడుచున్నాడో," అను వాక్యముల చేత ఆ యాలయములను యవనాది సైన్యములు పాడుచేసెనను నంశము - స్ఫురింపఁ జేయఁ బడినది. 8వ పద్యమున పాశ్చాత్యులు, యవనులు, ఖానులు, తురకలు, పేర్కొనఁ బడి "నీకు వారి సమాజాలు-మున్నగు వాని యందే ఇచ్చ పుట్టెనా" అని భగవానుని గురించిన యెత్తిపొడుపు కావింపఁ బడెను. "వీరి నందఱిని శీఘ్రముగా ఢిల్లికి తొలఁగఁ ద్రోలుము" అని చెప్పుటచేత వీరు ఢిల్లీనుండి వచ్చిన వారిని ఈ కవి తలంచినట్లు తోఁచును.- వీరిని విధ్వంసము నొనర్పుమని ప్రార్థింప కుంకుట వలన భారతీయ సహజమగు నీ కవీంద్రుని 'అహింసా దృష్టి' వెల్లడియగును.

9 వ పద్యమున "నీకొండ మీఁది కెక్కి, ఈదుష్టులు నిష్ఠాపరులగు భక్తులను గొట్టుట, పవిత్రములగు మంటపములందు కల్లు త్రావుట, నీ వంటసాలలో మాంసపు ముక్కలను వండుట, గుడిలోఁ జొచ్చి పరసతులను భంగపరచుట, మొదలగు దుష్కార్యములను జేయ చుండఁగనే, వారిని పౌరుషముతోఁ బారద్రోలు" మని ప్రార్థించుటచేత వారి దుష్కృత్యములు తదితరస్థలములందు ఎట్లు సాగినదియు తెలియనగును. 10 వ పద్యమున "ఇంత తాలిమి చేయుదే యిప్పటికిని! మట్టుకొనివచ్చె శత్రు సమాజమెల్ల" అనుటచేత సింహాచల దేవాలయ విధ్వంసన కార్యక్రమము త్వరలో జరుగనున్న సమయము నందే - ఈశతక రచనము ఆశుధారా రూపమున జరుగుచుండెనను నంశము స్పష్టపడుచున్నది.



11 వ పద్యమున ఆ సమయమున ప్రజలు పొందిన దుర్దశలు వివరింపబడినవి. "ఒక్కొక్క భార్యతోఁ గూడిన ఒక్కొక్క గృహస్థుఁడే - ఇన్ని యిడుముల నొందునపుడు అష్టమహిషుల మీఁద పదునారువేల సతులతోఁ గూడిన నీవెచటికి వలసపోఁగల" వని భగవానుఁ డిచట నధిక్షేపింపఁ బడెను.

12 వ పద్యమున భగవానుఁడు సృజించుకొనిన దేవాలయము యొక్క శోభాతిశయమును - మనోరంజకముగ వర్ణింపఁ బడినది. అందలి శిల్పవైభవమును ప్రస్తావింపఁ బడినది. 'ఇటువంటి ఇంటి చెడ గొట్టుకొనకు' మని నివేదింపఁబడినది.

అనేకములగు దేవాలయములతోఁ బాటు సింహాచల దేవాలయమునకుఁ గూడ రక్షకుఁ డగుచున్న శ్రీవిజయనగర మహాప్రభువగు 1 వ విజయరామ గజపతి ప్రభువు - ఇంను సత్ప్రభువని రెండు మూఁడు స్థలములందుఁ బేర్కొనబడెను.

"సత్ప్రభు రాజ్య నాశన మొందఁగంటివి......
'అలుకరాదా మెగా యవనులు సత్ప్రభు
వసుమతి మట్టుకొవచ్చినపుడు."

భగవానుని పరాక్రమాతిశయము పెక్కు తావులఁ గీర్తింపఁ బడినది. భక్తుఁడు కోపాదులనుగూడ లోకమునందుఁ బ్రకటింపక, భగవానుని యందే ప్రదర్శింపవలయు ననునది-భక్తిసూత్రసిద్ధాంతము. కనుకనే;

"జడ విప్పి జలపాలు సవరింపు మిరువంక
............ ....... ..............
బీబి నాంచారిని బిలిపింపు వేగమే
తుద కభ్యసింపు మీ తురక భాష"

అని తన క్రోధ భావోద్వేగమును వెల్లడించుట - 32 వ పద్యమునఁ జూడఁదగును. భావోద్వేగముగల యీకవి - యవనసైన్యములు - మీఁదికురుకనున్న యీ సమయమున భగవానుని యుపేక్షను సహింపక, ఎట్లు నిరసించుచున్నాఁడో! చూడుఁడు!

పాలీయ వచ్చిన భామిని ప్రాణంబు
లపహరించి చెలంగి నట్లుగాదు.

........................ 23

"గోవర్ధననగంబు గొడుగుగాఁ బట్టిన
నాడు కేలున నొప్పి నాటెనొక్కొ- 33

"మానునే గొల్లపాల్ ద్రావ మందబుద్ధి 34

"గొల్ల యా నందుని కులసతి పాల్ ద్రావ
పసులఁ గాచెడి బుద్ధి పట్టునదియె 35

"రాధికా మధురాధరామృత ధారలు
గుటుకు గుటుక్కునఁ గ్రోలఁ గలవు" 38

"ఆత్మకీర్తన చేయ హరిభక్త లేటికి
కేకలు వేయ పక్షులె గలరు 41

"దాచనుజమి మమ్ము దరిఁ జేర్పకుండినఁ
గొంకక మధురలో కుబ్జ మాట

ఆ యా దోషములను తెలుపనని చెప్పునిషతో దోషములను తెలుపుటయు, "ఈ దోషములను తెలుపకముందే నీ సిగ్గు నిలుపుకొనుము." అనుటయు ఇతని కవితా శిల్పమున కొక గీటురాయి! చూడుఁడు! —



"లక్ష్మి యా రుక్మిణీ లలనఁ గూడితి" వంటి
"సలరాధ మరగితి" వనుటలేదు 44

పద భావ సౌకుమార్యమునకు నెలవులగు పద్యములుకూడ నిందు పెక్కులు కాన్పించును.

"మామిడి చిగురు సొంపేమి లక్ష్యంబన. 46

యవనుల ముట్టడియు, శతకరచనయు, నేకకాలమున జరుగుచుండుట క్రమముగా విశదీకరింతును. ఇట్టి మహాకవి దూషణభాషణములను పెక్కింటిని ప్రదర్శించి, యవనసైన్యము సింహాచల పరిసర గ్రామములందు ప్రవేశించు నపుడచటి ప్రజలు - కాందిశీకులయిన దురవస్థను 47 వ సంఖ్యగల పద్యమున నిట్లు వివరించెను. 'ఈ దురవస్థలను జేయించునది నీవే' యని భగవంతుని నిరసించుటయు నిందుఁగలదు.

"భూమిమీఁద నడుగిడి నడువలేని వృద్ధులను శిశువులను పరువులెత్తఁ జేసినావు; పైనున్న దుప్పటి బరువను వారిచేత బరువులయిన మూటలు మోయించినావు; గడపదాటని కులకాంతా మణులను పలు దేశములందు త్రిప్పించినావు.

షడ్రసోపేతమగు అన్నమును భుజించు జనపరంపరచేత బలుసాకు తినిపించినావు; నీయఘటన ఘటనా ప్రభావమును దీనప్రజలయందే చూపించితివి; "నీ సాము - ఇంటనేగాని బయట కాదన్న మాట తెలిసివచ్చినది" అని

తదుపరి, ఈ మహాకవి - బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులకు - దుష్టులగు మ్లేచ్ఛులచేత నొదవిన దుర్దశలను ప్రస్తావించి, ఈ ఖలులనణఁ పని యెడల, నీకపకీర్తికలుగునని హెచ్చరించి, దశరథాదుల మీఁద ఆనలుపెట్టెను.

తరువాత "నీవు సింహాచల గుహాలలో దాగిన నిన్ను పిఱికి వాఁడందురు." ఇత్యాదులచేత భగవానునికి నిందాభయమును గలిగించి "కొసన్ బ్రోవు ముర్విజనుల" అని తొందరపెట్టెను. ఇంతలో శత్రు సైన్యములు సింహాచలము దరికి రాఁదొడఁగెను. ఆ విషయము నీ కవి చంద్రుడు "అరిసైన్యధూళి సూర్యాక్రాంతమై మించె నింకేమి దయఁ జూచె దీవుమమ్ము" ......

నీపయికి వచ్చునప్పుడు నీ వెఱుంగ
వేమి? మసలకు మింక, దిక్కేది మాకు?
జాగ రూకుఁడవై రి పుక్షయమొనర్పు." .. 51.

అని మందలించెను. పిమ్మట

"మా మొఖాసాకు గ్రామంబులిమ్మనలేదు, కొంపలు గాల్పింప కూడదంటి." అను పద్యమున - "గోవధ మాన్పించి ప్రోవుము, ప్రజలను దోషింపకుము, నీ ప్రజలను రక్షింపుము. నా కేమియు నిమ్మని నినుఁ గోరుటలేదు. నీ పదసేవలు చేయు మాకు వేఱుకోరిక లెందులకు" అని ప్రార్థించెను. ఇంతలో యవనులు సింహాచల గ్రామమును దోఁచి, భగవానుఁడు నివసించిన పర్వత పాదము నొద్దకు వచ్చిరి. అప్పుడు "భక్త సంరక్ష! కృపాపర! జలజాక్ష!" ... అని సంబోధించి "భవదచల పాదగతులైరి యవనులయయొ! అలుక మానక తరుము" అని గట్టిగా మొఱపెట్టెను. అప్పటివఱకును దుష్టులయిన యవన సైన్యము లొనర్చిన విధ్వంసనకార్యముల నిట్లు నివేదించెను.

"గ్రామములు - నిర్ధూమ ధామములైనవి. సస్యములు - నశించినవి. కూరగాయలు - దుంప శుద్ధిగాఁ బోయినవి. దుష్టులగు శత్రువులు - ప్రజల గోచులను దక్క - సర్వమును దోచిరి. ప్రజలు చెట్టా



పిట్టలై - చెదరిరి. పడరాని పాట్లుపడిరి." అని ఇట్లు వేదించి ఇపుడు పెద్ద తురక దండు నీ చెంతకే వచ్చినది. శీఘ్ర బుద్ధివి గనుక నీవే కర్తవ్యము నాలోచించుకో [ "శీఘ్రబుద్ధేః ఫలాయనమ్" శీఘ్ర బుద్ధియగు వానికి పారిపోవుటయే కర్తవ్యము," అను లోకోక్తి యిచట వ్యంగ్యము] అని మెత్తిపొడిచెను.

ఇప్పటికిని భగవంతుఁడు ప్రసన్నుఁడు కాకుండుటకు కినిసి "శ్రీదేవి నన్ను శత్రువుల చెంతకు వెళ్ళనీయదు. భూదేవి నన్ను తన బాహువల్లరులతో బంధించినది. ఇత్యాదులగు సాకులను చెప్పకు "అసలయినదియు, నిసలయినదియు, నగు విషయ మేమనగా! తురుష్కబలమును ద్రుంచుటకు నీకు బలము చాలకుండుటయే" అని గట్టిగా నిరసించెను.

ధ్యాన నిమగ్నుఁడగు నీమహాకవి కపుడు, నరసింహుని నిజ స్వరూపము స్ఫురించి యుండును. కనుకనే 59వ పద్యమున ఉపనిషత్ ప్రతిపాదితమగు పరమ పురుషుని విశ్వరూపమును :-

"నిఖిల విశ్వంబును నీయం దణఁగియుండు
విశ్వంబులో నీవు వెలసినావు

ఇత్యాదిగా స్మరించి

"కినుక విశ్వద్రోహ మొనరించు దుష్టుల శిక్షింపవేమి"? అని ప్రార్థించి "ఇంత బ్రతిమాల మాకేల? కంసకు లేని దూల బచ్చలికేల" అని తన నిరుత్సాహమును బ్రదర్శించెను.

తిరుగ 60వ పద్యమున, శ్రీదేవి - మెఱపుగాను, గంభీరమగు నీవాగ్ధార - గర్జితముగాను, హారమౌక్తిక కళలు - వడగండ్లు గాను, భ్రూలత - ఇంద్రచాపముగాను, కాఁగా, భక్తులను మయూరములను నటింపఁజేయుము, దీనులను చాతకములు - తృప్తినొందు నట్లు,

నీముఖకాంతిని దశదిశలను నింపి, భూమియందు, నీకృపయను జలమును వర్షించి ప్రజలను సస్యములను రక్షింపుము." అని ఏక దేశవివర్తి రూపకమున ప్రార్థించెను. పిమ్మట 62, 63, 64 పద్యములలో శ్రీరామ వేషమును సందర్శించి, తత్పరాక్రమమును ప్రశంసించి, నీచయవనసేనను నిర్జించుట - నీకొక దొడ్డ కార్యము కాదనియు, ప్రజలు చేసికొనిన పాపకర్మమున నీ చిత్తము కలుగకున్నదనియు, తాను గుర్తించిన సత్యమును విన్నవించి, పక్షివాహనము నెక్కి వచ్చి యవనసేనను బంధింపుమని మ్రొక్కెను.

పిదప "నీపాద రజమున నిమిషంబులోపల

బాపురే! నతియయ్యె చాపరాయి!"

ఇత్యాదిగా కీర్తించి "మున్ను తాటక ప్రాణముల్ గొన్న బాణంబు" ఇత్యాదిగా శ్రీరాముని బాణమును ప్రశంసించి, యవన ఖండమునకు ఆచండకాండములను బఱుపుమని విన్నవించెను. ఇచట బాణమునకు తొమ్మిది పర్యాయ పదములను ప్రయోగించుటవలన పద్యమునకు నవశోభ గలిగినది. బాణమునకు క్రొత్తపదును కలిగినది. భగవానుడు వరాహలక్ష్మీ నరసింహమూర్తికి పరిపూర్ణ ప్రసన్నత కలిగినది. విశ్వరూపుడను భగవానుడు తన ప్రభావమును ప్రదర్శించెను. మహాకవి కోరినవిధమున

"కోటి సూర్యోజ్జ్వలత్ కోటీరమణులతో

రమణీయ మణికుండలముల తోడ

శంఖచక్ర గదాసి శార్ఙ్గాయుధములతో...

పక్షి గుఱ్ఱంబు మీదను నెక్కి" వచ్చి,

యవనరాట్ సేనను ఉక్కుకేసి నాడో, లేక ఉక్కుమూతులుగల గండు తుమ్మెదలను బంపి ఆ దుష్ట సైన్యమును చించి చెండాడించి



నాడో, స్పష్టముగా దెలియదు "యవనుల గర్వమణగినది. ప్రజలు సంరక్షింపబడిరి. ఆలయమునకు ప్రమాదము తప్పినది. యవనులు మర్దితులయిరి" అను విషయము నిస్సంశయము. "హిరణ్యాక్ష, రావణ, శిశుపాల, కంసాదులను, వధించి, సుర, ముని, దీన జనులను రక్షించి ధరణిని పాలించిన నీమహిమాదులను వినుటయేగాని, కన్నులగనుటలేదు. ఇప్పుడు యవనుల గర్వమణచి, ప్రజలను రక్షించిన నీప్రభావము నంతను గంటిమి" అను 69 వ పద్యమునను, 70 వ పద్యమునను, ఈ విషయము స్పష్టముగా నున్నది చూడుడు :—

—: రెండు ప్రక్షిప్త పద్యములు :—

జయ సంవత్సర ఫాల్గుణమునందు ప్రకటింపబడిన ఆరాధన పత్రికయందు 69, 70 సంఖ్యలు గలవిగా ముద్రితములయిన పద్యములు రెండున్నవి. క్రింది సీస పద్యము 69 వ సంఖ్యను గలిగియున్నది:—

సీ॥ కారుణ్యదృష్టిచేగని మమ్ము రక్షింప

నీ రజేక్షణ! నేను నీవు పంప

పారసీకుల దండుపై గొండలోనుండి

గండు తుమ్మెదలు నుద్దండలీల

కల్పాంతమున మిన్నుగప్పి భీకరమైన

కారుమేఘుంబులుగ గవిసినట్లు

దాకిఘోరున రక్తధారలు గురియంగా

గఱచినెత్తురు పీల్చి, కండలెల్ల

నూడిపడ, నుక్కుమూతుల వాడి మెఱసి

చించి, చెండాడి, వధియించె చిత్రముగను

నొక్కొకని చుట్టుముట్టి బల్ మిక్కుటముగ ॥వైరిహర॥

క్రింది పద్యగీతము 70 వ సంఖ్యను గలిగియున్నది.

గీ॥ అరులఁ బరి మార్చి, వైశాఖ పురసమీప
గిరి బిలంబునడాఁగె, బంభరము లెల్ల;
అది మొదలె తుమ్మెదల మెట్టయంద్రుదాని
వైరి హర రంహా! సింహాద్రి నారసింహా!

శ్రీ సింహాచల దేవస్థాన కార్యనిర్వాహణాధికారి, శ్రీ దాట్ల వరాహాలక్ష్మీ నరసింహరాజుగారు - ప్రస్తుతమగు శతకమును ప్రకటింపఁదలచి, నిర్దుష్టమగునట్లు పరిష్కరించుటకు మీఁది పత్రికను నాకుఁ బంపి యుండిరి. ఆరాధన పత్రికా ప్రచురణ కర్తలచేత గ్రహింపఁబడిన ఒరిజనులు ప్రతినిగూడఁ జూడవలసి యుండునని నేను విన్నవింప 1930 సంవత్సరమున "శ్రీ వరాహ లక్ష్మీ నారసింహ శతకము" అను పేరున, "అందే కృష్ణమూర్తి బ్రదర్సు విశాఖపట్టణము" వారిచేత ప్రకటింపఁబడిన యీ శతకముయొక్క ఒరిజినల్ ప్రతినిగూడ పంపించిరి. దీనియందును పెక్కు దోషములు గలవు.

విజయనగరమున - శ్రీరామానుజ విలాస ముద్రాక్షరశాలయందు 1930 సంవత్సరమునందే, ఈ నామముతోనే ముద్రితమయి, ఆర్. సంజీవిరావు అండ్ సన్ వారిచేత ప్రకటింపఁబడిన యింకొక ప్రతిని మిత్రులు, శ్రీ చింతలపూడి సన్యాసిరావుగారు నాకొసఁగిరి. దీనియందును గొన్ని దోషములు గలవు.

ఈ ప్రతులు - రెండిటను పాఠభేదములున్నను, పద్యసంఖ్యాక్రమము ఒకేతీరున నున్నది. మీఁది పద్యములు ఈ ప్రతులు రెంటియందును గూడ లేవు.

68 వ పద్యము తరువాత "జయమూఁడె" అను పద్యము – ఈ ప్రతులు రెండిటియందును 69 వ పద్యముగా గుర్తింపఁబడి యున్నది



కనుకనే, యీప్రతులు రెండింటియందును గూడ 101 పద్యములు మాత్రమే కాన్పించుచున్నవి.

ఆరాధన పత్రికయందు క్రొత్తపద్యముల చేరికవలన "జయమూఁడె యవనరాట్ సంతమసముపాసె" అను 69 వ పద్యము - 71 వ పద్యముగా గుర్తింపఁబడినది. కనుక మొత్తము పద్యముల సంఖ్య 103 గా గుర్తింపఁబడినది. ఈ పద్యములయందలి శైలశైలీ సంవిధానములను సమీక్షించిన వారికివి - ఈ మహాకవి రచనలుగాఁ దోచవు. మొదటి పద్యమున గండు తుమ్మెదలు నుద్దండలీల" అను చోట అనావశ్యకమగు సముచ్చయము (గండు తుమ్మెదలును=గండు తుమ్మెదలుగూడ అనునది) కాన్పించుచున్నది. తదితరులను విడిచి పారసీకుల దండుమీఁదనే తుమ్మెదలు కవిసినట్లు చెప్పఁబడినది.

మఱియు, సీసపద్యమునందలి యర్థము ప్రతిపాదాంతమునను సముచిత విన్యాసయుక్తమగు నర్థసమన్వయము నొందక, ఉత్తరోత్తర నపేక్షించుచు, ఒకే వాక్యమగుటవలన గద్యరూపమును వహించి యున్నది.

ఈ సంవిధానముగల పద్యము — వేఱొకటి యీశతకమున నెచ్చటను కనిపించుటలేదు.

70 సంఖ్యగలదిగా ఆరాధనయందు గుర్తింపఁ బడిన ప్రత్యేక పద్యగీతము — సీసపద్యశతకము నడుమనుండుట — సంగతము కాదు. "అది మొదలె తుమ్మెదల మెట్టయంద్రుదాని" అను దీని మూఁడవ పాదమునందలి యర్థము. ఇది శతకరచనాకాలమున రచింపఁ బడిన పద్యముకాదు." అనునంశమును స్ఫుటీకరించుచున్నది. "కాలాంతరమున నీ కవిచంద్రుఁడే దీనిని రచించి యిందు చేర్చెనని తలంపవచ్చు" ననిన, సీస పద్యశతకము నడుమను అల్పా

ర్థకమును, అర్థగాంభీర్య రహితమును, నగు సీసగీతపద్యమును సమర్థుఁడగు నామహాకవియే చేర్చెననుట సమంజసముగాఁదోఁచదు. ఈ పద్యములు — ఈశతకమునందలివేయను నభినివేశము గలవారు — ఈ పద్యములుగలదియుఁ బ్రాచీనమయినదియు, నగు ముద్రిత ప్రతినిగాని, వ్రాత ప్రతినిగాని, ఎందయిన సంపాదించి ప్రదర్శింపవలసియుండును.

“ఉక్కుమూతులుగల గండు తుమ్మెదలు — కొండలోనుండి కల్పాంతమేఘములవలె నుదయించి, యవనులను చించి చెండాడుట” అను విషయమును,

“శత్రువులను జంపిన యాతుమ్మెదలు — విశాఖపట్టణ సమీపమునందున్న పర్వతబిలమున దాగుటవలన నాపర్వతమున కప్పటి నుండియుఁ తుమ్మెదల మెట్ట! అనుపేరుగలుగుట” అనువిషయమును, జనపరంపరా ప్రసిద్ధములయి యున్నవి. కనుక సత్యములయినఁ గావచ్చుననుగాని, ఆవిషయము నీకవీంద్రుడు శతకమునను ల్లేఖించెననుట కాధారము కన్పింపదు. భక్తుల కీవిషయమున విశ్వాసముఁ గలిగించుటకు — కాలాంతరమున సముచితమగు సందర్భము గల 68 వ పద్యమునకుఁ దరువాత నివి — ఇంకొక సామాన్య కవి చేత ప్రక్షిప్తములని తలంప వచ్చును. ఆరాధన సంపాదకులకివి మెచ్చుటనో లభించి యుండవచ్చును.

ఒరిజినల్ ప్రతియందుగల 68 వ పద్యమున — “యవనుల గర్వమునణఁచిన నీ ప్రభావము నెల్ల నిప్పుడు కంటిమి.” అనిచెప్పి 69 వ పద్యమున “జయ మాయె యవనరాట్సంతనుసము పోసె, భువనజాతంబులు తెలివినొందె ... నీవు నీలీలచేత నామనవి జెల్లించి నావు” అనుచోటఁ జెప్పబడిన లీల — గండు తుమ్మెదలను సృజించి పంపుటయో, లేక, స్వయముగా భగవానుడే వచ్చి యవనులను



ద్రుంచుటయో, కావలెను. ఈ పద్యము చివరను “నేను నిన్ను మెచ్చి నీకేమి యియ్యఁగలనుఁ తులసిదళమొక్కటిత్తును” అనుట వలన ఆలయమునకును, భక్తజనులకును, గలుగనున్న విపత్కర స్థితి తొలఁగిన దనుట — నిస్సంశయమగు సత్యవిషయమని చెప్ప వచ్చును.

తరువాత, ఈ మహాకవి భగవంతుఁడగు నరసింహుని తాను నిష్ఠురోక్తులు పలికి నిందించినందులకు పశ్చాత్తాపపడి, “అపరాధినపరాధిని” అని, 33 పర్యాయములు పలికి, దయఁ జూపుమని క్షమాపణము వేడుకొనెను. 71 వ పద్యమున “వీరాధి వీరుఁడవై విరాజిలు నిన్ను, బిఱికివాడంటిని భీతిలేక,”

ఇత్యాది సీసపాదముల యందింతకు ముందు తానాడిన మాటలను దెలిపి “మదపరాధ సహస్రము మదిక్షమింపు” అని ప్రార్థించెను. తదుపరి “పరమమోహాంధుండ పాపస్వభావుండ” ఇత్యాదిగా తన్ను నిందించుకొని, శరణము నొసఁగి, తన్నాదరింపఁగోరెను.

ఇప్పటికీ మహాకవికిఁ గలిగిన భావోద్వేగ, భయోద్వేగములు శాంతి నొందినవి. భగవన్మహత్త్వమును ప్రత్యక్షముగ సందర్శించి, బ్రహ్మానంద పారవశ్యము నొందుటవలన హృదయమున భక్తితత్త్వము విజృంభించెను. [illegible] వ పద్యము ఈ కవి చంద్రునికిఁ గలిగిన సరసమగు భగవత్సేవా దృష్టినెట్లు వెలార్చినదో చూడుడు! దీనియందు భగవానుఁడు శత్రువులను మర్దించి నట్లుకూడ చెప్పఁబడెను.” చలువగా పన్నీట జలకంబు లాడించి, విలువలేని కడాని వలువఁగట్టి... .. విడెమిది, పదములొత్తెద నేడ్కతోడ— పవ్వళింపుము మన్మనః పద్మశయ్య — నలఁపులనెల్ల మర్దించి యలసినావు” అని విన్నవించెను. దీనియందు, “ప్రభూ! శత్రువుల నందరిని గూడ మర్దించి యలసితివి. స్నానమాడి, తిలకము దిద్దించుకొని రసాన్నము భుజించి

నాహృదయ పద్మశయ్య యందుఁ బరుండుము. నేను నీపదము లొ
దను" అనుటచేత, భగవానుడు స్వయముగనే శత్రువులనందఱ
మర్దించినట్లు తెలియుచున్నది. అహో! కూర్మదాస మహాకవి యెం
ధన్యుడు. శత్రుసంహారము నొనర్చుచున్న భగవంతుఁ డతని దివ్య
చక్షువులకు సాక్షాత్కరించెను. 78వ పద్యమునుండి 98వ పద్యము
వఱకును గల పద్యములయందు - ప్రౌఢమగు రచనతో దశావతా
ములు వర్ణింపబడి, వానినిఁగూడ నాకుఁ జూపుమని భగవంతుఁ
ప్రార్థింపఁ బడెను. శ్రీరామావతారము విశేషించి వర్ణింపఁబడినది.

"శిలడాసినప్పుడె" అను 87 వ పద్యము శిలారూపము
అహల్యా రూపమున క్రమపరిణామము నొందినట్లు వర్ణింపఁబడిన
ఇందలి యర్థగాంభీర్యము. ప్రశంసార్హము. అమూల్యము. 77
పద్యము నుండి 100 వరకును గల పద్యములందలి కవితా శిల్పము
ప్రశంసార్హమగుచున్నది. ఈ మహాకవి - జాతీయ పద ప్రయోగమ
నందును, లోకోక్తి ప్రదర్శన చాతుర్యము నందును నిరుపమానము
ప్రతిభను ప్రదర్శించి యున్నాడు. క్రింది జాతీయ పద ప్రయోగము
లను జూడుఁడు.!

"వేం చేయుమయ్య, లెసిపోఁగొట్టుకోకు, మాపాలఁ గలిగి
బాపురే, బాగులే! యిట్టి నెఱవైన ప్రాపు. ఒద్దుకొనఁబోకు, నీదు
చిత్తంబు కరుగదాయె. 'చిన్ని రామన్న'. నన్ను రక్షింపుమన్న
మలాడిగందము, కుఱుపాలు, పెద్దఝారీలు, గుడిగుడీలు, చుక్క
లెదురె," సమయోచితములగు తురుష్క పదములు పెక్కులింద
ప్రయోగింపఁ బడి, పాఠకులకు హర్షదాయకములగుచున్నవి.
చూడుడు! "బేగో అకే అరబ్బీ పడోఁకె" అని బోడిసన్యాసులఁ
బొడుచువారు" 36 "పాముదోనేకు తుం పానీ లారే, అని తివి
శ్రోత్రియుల మర్దింపకుండ" 28. ఈ వాక్యము లానాటి ప్రజల



సులభ భావ బోధకములుగా నుండియుండును. రమణీయములగు
లోకోక్తులిందు కొల్లలుగా నున్నవి. ఈ లోకోక్తులు ప్రస్తుతార్థమున
నుపయోగించు విధమునఁ గూర్పఁబడి, భావోద్దీపకములగుట యిందలి
విశిష్టత! చూడుఁడు!

"ఇందిరను గూడియుంటివీ వింటికన్న - గుడి పదిలమంచు"
(2 వ పద్యము)

వ్రతము చెడ్డ సుఖము దక్కదు 8
వేటకాఁడిల మెత్తనా వేళ లేడి-మూఁడుకాళ్ళను నడుచు 9
కొండయెక్కదు బ్రతిమాలికొనిన కోలఁది 17
ఏండ్లెగసనైన, బుద్ధి దిగసన వచ్చెనో 19
తినఁదినఁగ గారెలైనను కనరు వేయు 20
వేసంబు చెడిన నీకెట్లు గడుచు 21
లెన్మికను మీనమేషముల్ లెక్కయిడక 23
నిజమాడ నిష్ఠురంబౌ నటంద్రు 24
కొండతికిని మునుశిశువునేడిపింపక ముద్దురాదు 31
గుడిమ్రింగువానికి లింగ మూర్ఛిండి వడెము 36
గాదెదీయు దనుక బీనల ప్రాణముల్ తాళుబెట్టు? 37
కబళమన నోరుఁ దెఱతువు - కళ్ళెమన్న మోముఁ ద్రిప్పు
హయగ్రీవ మూర్తి వహహ! 38
పట్టియూసల నిటు మెడపట్టి త్రోయ చూరు పట్టుక వ్రేళ్ళాడి
నారము. 41
వెన్నగలుగ నహహా నేతికి నేటికి నంగలార్ప. 54
వాండ్రడందసికయు, నందకుండిన గాల్పట్టు కొందురయ్య! 55
కందకులేని దురద! బచ్చలికి నేల గల్లు 59
కర్మమా మాకు గజమెక్క కంతదూర 66

ఇట్టి వింకను పెక్కులు గలవు. ఇట్టి శతకము, నట్టి విపత్కర సమయమున, ధైర్యముతోను, నిర్భీతితోను, ఆశుధారా రూపమున రచించిన కూర్మదాస మహాకవియు, అతని నోట వెలువడిన ప్రతి పదమును అత్యాశువున లిఖించిన, ఆమర్తి హరిహర దాస వర్యుఁడును, మిగుల ప్రశంసింపఁదగిన వారగుచున్నారు. ఆరాధన పత్రికయందలి పాఠమును ఇతర ప్రతులయందలి పాఠభేదముల ననుసరించి సవరించి, వీలయినంతవఱకు మహాకవి రచనను సుత్తించి, పరిష్కరించుట జరిగినది. మార్పులు స్వల్పముగా నొనర్పఁబడినవి. విజ్ఞులు మన్నింతురుగాక !

ఇట్లు సజ్జన విధేయుఁడు
సాహిత్యాచార్య, కవితాశేఖర
పంతుల లక్ష్మీనారాయణశాస్త్రి
ఆంధ్రభాషాశాఖాధ్యక్షుఁడు
ప్రభుత్వ మహారాజ సంస్కృత కళాశాల

పత్తిపాటివారివీధి
విజయనగరము.
30-12-62.



# సింహాద్రి నారసింహ శతకము

సీ॥ శ్రీమ ద్రమారమణీ మణీరమణీయ
సరస చిత్తాబ్జ బంభర ! పరాకు
శంఖ చక్రగదాసి శార్ఙ్గ చాపాది భా
సురదివ్య సాధనకర ! పరాకు
ప్రహ్లాద నారద వ్యాస శుకాదిక
భక్త సంరక్షణ పర ! పరాకు

తే॥ నీకు సాష్టాంగ వినతు లనేక గతులఁ
జేసి విన్నప మొనరింతుఁ జిత్తగింపు
చెనఁటి పీఁడని మదిలోనఁ గినుక మాని
వైరి హర రంహ సింహాద్రి నారసింహ ! 1

సీ॥ "అవధారు దేవ ! చిత్తావధానతఁగాను,
వనజజాదులు సేయు వందనములు;
సెలవై రాత్రిందివ స్థితి గతుల్దెలుపగా
సోమ పద్మాప్తులిచ్చో నిలిచిరి;
మందారతరు సూన మాల్యముల్గొని యింద్రుఁ
డే తెంచె నిందుల కేమియాజ్ఞ ?
గంధర్వకిన్నరు లర్ఘ్యగత వీణులై
తడవాయె వచ్చిరి దర్శనేచ్ఛ."

తే॥ అనుచు జయవిజయులు దెల్ప 'హాయి' యనుచు
నిందిరను గూడి యుంటివీ "వింటికన్న
గుడి పదిలమంచు" యననులఁ గొట్టవయ్య ॥వైరి॥ 2

సీ. చటుల సోమకహార స్ఫుట తరాటోపంబు
కుంభినీభరణ విజృంభణంబు
ఖల హిరణ్యాక్ష శిక్షణ రూక్షదక్షత
క్షుభిత హిరణ్య రక్షోభిదాత్మ
బలి మహావైభవ భంజన మహిమంబు
నుర్వీశ గర్వాంతకోర్వతిశయ
మతిదుష్ట దశకంఠ హరణ బాహాశక్తి
ప్రబల ప్రలంబ దారణ విధంబు
తే. పురవధూవ్రతభంగ విస్ఫురణ సరణి
భువనములఁ బ్రోవగావించి; జవనయవన
సేన నణచుట కిటు జాగుసేయఁ దగునె? ॥వైరి॥ 3

సీ. మొఱ వోయెనో వక్రముఖ వక్రహరమహా
సంపర్క నిర్వక్ర చక్రధార
* వాడిదప్పెనొ హాతోద్భాసి సుమాలి మ
హాసుర శార్ఙ్గ బాణాసనంబు
పదనువాసెనొ మధుప్రముఖేంద్ర రిపురాజి
బృందాంతకారక నందకంబు
కడిమి దప్పెనొ సౌంభక మథన ప్రవిధాన
చండమై తగుగదాదండ పటిమ
తే. జబ్బు పడియుంటివేల మాయబ్బయొక్క
దెబ్బతీయక తురకల యుబ్బు చెడదు
గొబ్బునఁ జెలంగు మికనైన నిబ్బరముగ ॥వైరి॥ 4

* వాసి. పాఠాంతరము.



సీ. చుట్టబెట్టెను మహారట్టజంబులతోడ
నిఖిల రాజ్యము పఠానీలఫౌజు
మట్టి మల్లాడెను మదసామజంబులఁ
బురజన పదములు తురకబలము
కొట్టికొల్లలు వెట్టె గురు విప్ర మానినీ
ఘన గోగణంబుల ఖాన సమితి
పట్టి పల్లార్చెను బహుదుర్గ వర్గముల్
సరభసొద్ధత్య పాశ్చాత్యచయము
తే. మించి భూస్థలి నిటు లాక్రమించి రాఁగ
నలుకరాదేమి నగరివారలను దోఁచఁ,
బొంచియుంటివి యవనుల ద్రుంచుమికను ॥వైరి॥ 5

సీ. మొగిసి రక్కసుని బొందుగజించు నీగోళ్లు
చిటిలెనో సిరిపుచ శిఖరిఁ దాకి
యరులపై భగభగలాడు కోపజ్వాల
లారెనో శ్రీకటాక్షామృతమున
పరవీర గర్భముల్పగించు బొబ్బ ప
లకదో రమానంద గద్గదిక చేత
ఖలుల దండింపఁగాఁ గరినమా నీకుండ
కరగెనో శ్రీలక్ష్మి సరసకేళి.
తే. సహహ నీశీకరోద్వృత్తి నల్పులనక
యవనరాజుల నడచి వ్రేయంగవలయు
చిన్న పామునకై నను పెద్దదెబ్బ ॥వైరి॥ 6

సీ. పొదలలో దాగెనో పొట్నూరులో నున్న
రమణీయ కోదండ రామమూర్తి
యెక్కడికేగెనో యెఱుగంగరాదుగా
పటు భీమసింగి గోపాలమూర్తి
సాధ్యసోద్వృత్తి నెచ్చటికేగి యుండెనో
జామి జనార్దనస్వామి మూర్తి
యెన్నిపాట్లను బడుచున్నాడొ చోడవ
రంబులోఁ గేశవ రామమూర్తి

ఆ. నిబిడ యవనుల భయశంక నీవు నింకఁ
బరుల కగపడకుండు, మీ ప్రక్కనున్న
గాయ మిప్పటికిని మానదాయె నయమొ! ॥వైరి॥ 7

సీ. పాశ్చాత్యుల సమాజుపై బుద్ధిపుట్టెనో
మానుల జపముపై మనసురోసి
యవనుల కందూరి యందిచ్ఛ చెందెనో
విప్రయజ్ఞము లపై విసువుపుట్టి
ఖానజాతి సలాముపై నింపుపుట్టెనో
దేవతా ప్రణతిపై భావమెడలి
తురకల యీదునందు ముదంబు గల్గెనో
భక్త నిత్యోత్సవ పరతమాని

తే. వారలు దుర్మార్గులయ్యెమో 'వ్రతముచెడ్డ
సుఖము దక్కదు' వడి ఢిల్లి చొరగఁ దోలు
పారసీకాధిపుల పటాపంచలుగను ॥వైరి॥ 8



సీ. నీకొండపై నెక్కి నియతులౌ భక్తులఁ
గొట్టి నానావస్థ బెట్టకుండ
గాంగధారా శీకరకలిత మంటపముల
మద్యపానముఁ జేసి మలయకుండ
నీ వంటసాలలో నిశ్శంకతో మాంస
ఖండముల్మెండుగా వండకుండ
నీగుడిఁ జొచ్చి దుర్నీతిఁ గామాంధులై
పరవధూటుల భంగపఱుపకుండ

తే. పౌరుషంబునఁ దుఱకలఁ బాఱదరుము
వేటకాడిల మెత్తనావేళ లేదీ
మూఁడుకాళ్లను నడుచు నిర్మూలితాంహ! ॥వైరి॥ 9

సీ. సెలవైన భైరవుండలుకచే వైరుల
నెత్తి బల్లదచేత మొత్తలేడె
యాజ్ఞ ఇచ్చిన వీరహనుమంతుఁ డహితుల
ఘన వాలమున నేలఁ గలుపలేడె
యంపించితేఁ త్రిపురాంతకుం డరి సేన
ఘోర శూలమ్మునఁ గ్రుమ్మలేడె
కనుసన్నఁ జేసిన వినతాతనూజుండు
విమతుల నెగిరిపో విసరలేడె

తే. ఇంతశాలిమి చేయుదే ఇప్పటికిని
మట్టుకొనివచ్చె శత్రుసమాజ మెల్ల
ప్రజల రక్షింపు యవనేశు బలముఁగూల్చి ॥వైరి॥ 10

సీ. యవనేశు ఘాటికిఁన్ హడలి సర్వస్వమ్ము
విడిచి, మందిరములు వెడలువారు,
వెడలియుఁ దలదాచ వెరవేమి గానక
నడవుల నిడుమఁ బడెడువారుఁ,
బడియు నెచ్చట కూడు, బట్ట గానక తమ
శిశువులతో వెతఁజెందువారుఁ,
జెంది డెందము గుంద గాందిశీకతనధి
మానార్తులై ఖేద మూనువారు

తే. వైరి యొక్కొక్క భార్యతో నవని ప్రజలు
అష్టమహిషులపై పదియాఱువేల
సతులతో నీవు వలన కెచ్చటి కరిగెదు

సీ. దర్పణాకృతి తళతళలాడు కంబాలు
డంబై చెలంగు శేడా హారంగు
చెప్పఁజూపగరాని యొప్పున నుప్పరం
బప్పళించెడు వంకకొప్పు చొప్పు
చిత్రవిచిత్రమౌ చిత్రంపు బొమ్మలఁ
గులుకు చక్కని గుళ్ళు గోపురములు
అమృతోపమానమై యలరారు గాంగధా
రాముఖ్య సకల ధారాజలంబు

తే. నెంత ముచ్చటపడి సృజియించినావొ
యిల్లు చెడగొట్టుకొనకు, నన్నేలి నయ్యా !
ఘనతురుష్కులఁ బడగొట్ట మనసుఁబెట్టు ॥వైరి॥ 12



సీ. యవనధాటికి భయమందియే కాఁబోలు
నక్కఁజంబుగఁ గొండ నెక్కినావు
ఖానులకడలియే కాబోలు, సంపూర్ణ
పౌరుషంబునఁ గత్తి పట్టవైతి
వఖిల పాశ్చాత్యుల నలమ లేకయె పోలు
తాపసగతి జడఁ దాల్చినావు
మ్లేచ్ఛనాయక బలాలికి జంకి కాబోలు
మిక్కిలి గంధంబు మెత్తినావు

తే. గట్టిగా నీవు తురకల ముట్టకుండ
నవవరాహాకృతి ధరించినావు సామి
వలదు నిందలఁబడ తురుష్కుల వధింపు ॥వైరి॥ 13

సీ॥ పటుతరస్తంభంబు పటపట బ్రద్దలు
గా జనించిన నీయఖండ మహిమ
చటుల తరంబుగా పెటపెట దంష్ట్రలు
కొఱుకుచు వచ్చు నీ ఘోరవృత్తి
స్ఫుటతరోద్భట వృత్తిఁ జిటచిట ధ్వని మీరు
నీ నిటలాక్ష వహ్నిక్రమంబు
కుటిల నఖంబుల సాట సాట నెత్తురు
సింద రక్కసు రొమ్ముఁజించు కినుక

తే. యెందుఁబోయెనో నేడు మహీజనంబు
గుంద యార్థత్వమునవచ్చు ఘోర యవన
బృందములయందుఁ జూపు తద్భీకరగతి ॥వైరి॥ 14

సీ॥ నట్టువల్ ద్రొక్కఁగా నవయామునీయ కూ
లంబుగాదు రణస్థలంబుగాని
కొట్టితోలఁగ నీకు గోవృషభంబుల
బాజుగాదు గుఱ్ఱాల ఫౌజుగాని
పట్టిమాడఁగ నీకు పసిగాపు చెలులు పా
లిండ్లుగావు ఫిరంగీ గుండ్లుగాని
ముట్టిముక్కలు సేయ ముఱిసిన యర్జున
తరులుగా వరివీర తరులుగాని

తే॥ యవన బలములతోడ పోరాడలేవు
శూరుఁడౌ జరాసంధుండు చుట్టుకొనిన
నాటి తీరయ్యె మేల్నీకు నవ్వుగాదు ॥వై రి॥ 1

సీ॥ కాంతలఁ జెఱబట్టఁ గనుఁగొనుచుంటివి
పాంచాలి వెతయెట్లు బాపినావు
గోవధసేయఁ గన్గొనుచుంటి విప్పుడు
కరుణతోఁ గరినెట్లు కాచినావొ
ద్విజులు బాధలుపడ తిలకించుచుంటివి
భువిఁ గుచేలుని నెట్లు బ్రోచినావొ
'సత్ప్రభు' రాజ్యనాశనమందఁ గంటివి
ధ్రువునికెట్లిచ్చితో దొడ్డపదవి

తే. దుష్ట శిక్షణ మొనరించి, శిష్టరక్ష
చేయకుండిన పూర్వ ప్రసిద్ధి చెడును
ఆర్తరక్షణ బిరుదంబు హానిఁజెందు ॥వై రి॥ 1



సీ. సముదగ్రమగు సముద్రముఁ జొచ్చియాడుటో
కొండ నెత్తిని బెట్టుకొంటయొక్కొ
ధారుణీస్థలిఁ ద్రవ్వి తలనెత్తుకొంటదో
గొబ్బున సింగంపు బొబ్బయిడుటొ
యడుగిడి త్రైలోక్య మాక్రమించుటయొక్కొ
వేయిచేతులవాని వేయుటొక్కొ
యొక శరాగ్రమ్మునను దధి నింకించుటో
కరిపురంబెల్ల బెగడ్చుటొక్కొ

తే. కరుణ జగముల బ్రోచుటో తురగమెక్కి
ఘనరిపుల గొట్టుటో, తురుష్కవధయెంత ?
కొండయెక్కెదు బ్రతిమాలుకొనిన కొలది ॥వై రి॥ 17

సీ. కులుపాలు ప్రొద్దున గ్రోలక యొక క్షణ
మైనఁ దాళవుగదా యాకటికిని
బాగుగా మెయి మలాకీ గంధమలదక
యింపుపుట్టదుగదా యెప్పటికిని
తనువునిండగ ధగద్ధగిత పట్టాంబరం
బవధరింపక మానవహారహంబు
నాటపాటలు మొదలగు వినోదంబుల
నుబుసు పుచ్చక గాని యుండలేవు

తే. భక్తులెల్లరు దుర్మార్గపరతురుష్క
రాజిచేఁబొందిరిదె పడరానిపాట్లు
భోగరాగంబులిక నీకుఁ బోనగు టెట్లు? ॥వై రి॥ 18

సీ. పుట్టినప్పుడు వీకఁ బోకార్చితివి భళీ
పూతనాఖ్యోపేత యాతుధానిఁ
బుడమిపై కడు తప్పటడుగిడు నప్పుడు
బండిరక్కసు మేను చెండినావు
ఆటప్రాయమునఁ దృణావర్త బక ధేను
కాది దైత్యకులంబు నణచినావు
యౌవనంబున నృశంసావతంసక కంస
విధ్వంస నరిరంస వెలసినావు
తే. భూసురులఁ బ్రోవవేమి మహాసురారి!
యిప్పుడేటికి ద్రుంప వేం డ్లగసనైన
బుద్ధి దిగసననవచ్చెనో పో మరేమి ॥వైరి॥ 19

సీ. ఎలమితో సోమయాజుల పెద్దర్జారీలు
గుడిగుడీలుగఁ జేసికొనెడివారు
యజ్ఞవాటికలలో నగ్నిహోత్రంబుల
ధూమపానముఁ జేసి త్రుళ్ళువారు
యాగపాత్రలు దెచ్చి హౌసుగావడిలుడి
కీచిప్పలుగఁ జేసి కేరువారు
స్రుక్స్రువ ముఖ్యదారు మయోపకరణముల్
గొని వంటపాయి నిడుకొనెడువారు
తే. నగుచు యవనులు విప్రులఁ దెగడుచుండ
నవనభోక్తవు నీవిట్లు సైపఁదగునె
తినఁదినఁగ గారెలైనను కనరువేయు ॥వైరి॥ 20



సీ. చింపికుల్లాయైన శిరమునఁ దాలిచి
దివ్యకిరీటంబుఁ దీసిదాచు,
వనమాలికయు చాలు వక్షంబున ధరింపఁ
గౌస్తుభరత్నంబు గట్టిసేయు,
పూడకుండఁగ జెవి పుడకైన నిడుకొని
మకర కుండలములు మాటుసేయు
కటి ధగద్ధగిత మాకనక చేలంబేల
మొలచుట్టు మొకపాటి ముతుకగుడ్డ
తే. దొడ్డసరుకులు తురకలు దోచుకొనినఁ
గష్టమా కానివేళ జగత్కుటుంబి
వీవు వేషంబు చెడిన నీకెట్లు గడుచు ॥వైరి॥ 21

సీ. నా మొరాలింపవు నారదగానంబు
వినుచుంటివో నేడ్క నీను లలర
గరుణఁ జూడవు మమ్ము గమలా మహాదేవి
కన్నులు మూసెనో కౌతుకమున
మముఁ బ్రోవ రావేమి కమలభవాదులు
భక్తితోఁ బాదముల్ పట్టుకొనిరొ
ఆదరకలన మాటాడవు భూనీళ
లలరగా ముచ్చట లాడుచుంద్రొ
తే. ఇట్టులున్న ననాథల కేది దిక్కు
క్షమయమా యిది కేళికా సౌఖ్యమునకు?
దుష్టుల వధించిఁ బోవు సాధువులనెల్ల ॥వైరి॥ 22

సీ. పాలీయవచ్చిన భామిని ప్రాణంబు
లపహరించి చెలంగినట్లు గాదు.
యాగోత్సవంబున నతిమోదమున బిల్వ
నపుడు మామను ద్రుంచినట్లు గాదు
చేతగాకొక నరుచేతఁ జుట్టంబుల
సంగరఁ జంపించినట్లు గాదు
తుంగగల్పించి యుత్తుంగ వంశద్రోహ
మాచరించి చెలంగునట్లు గాదు
తే. పర బలం బిది నీప్రజ్ఞ పనికిరాదు
లెమ్మికను మీనమేషములెక్క-యిడక
దొరవ తురకల గొట్టగాఁ జక్క-లెదురె ॥వైరి॥ 2

5
సీ. అవని మూడడుగు లిమ్మని వేడనిచ్చిన
బలి నణంచిన దేమి ప్రాభవంబు
ఇనకుమారుని మది కిచ్చకంబుగఁ బొంచి
వాలిని జంపుటే పీలు నీకుఁ
గడు కాలయవనున కడలి యాముచకుందు
పాలికే తెంచుటే పౌరుషంబు
భువి జరాసంధుతోఁ బోరాడగా లేక
ద్వారకఁ జేరుటే ధైర్య వృత్తి
తే. యూర నిజమాడ నిష్ఠురంబౌనటంద్రు
కాకరోమంబు గలిగిన గఠిన యవన
సేన నిర్జించి యీయాంధ్ర సృష్టి నిల్పు ॥వైరి॥



సీ. నీరు "హుక్కా పకడ్డో రె గద్దా"యని
యాహితాగ్నుల నెత్తులణచకుండ
"పాము థోనేకు తుం పాని లా (వ్) రే" యని
తివిరి శ్రోత్రియుల మర్దింపకుండ
"ఘూసులారే అరే గాండూ" అనుచు శిష్ట
తతులపైఁ బడి వడిఁదన్నకుండ
"కులితీ పకావురే జలిదీ" యటంచుమా
ధ్వుల మెడ వడిఁబట్టి త్రోయకుండ
తే. బహులహాలా మదావిల పరుషయవన
రాజి నిర్జింపు నీవంటి ప్రభువుగల్గ
బ్రాహ్మణుల కిన్ని పాట్లు రారాదుగాదె ॥వైరి॥ 25

సీ. అగ్రజు పీడితుండైన విభీషణు
నీవి మున్ దయజూచినావు గావా
అలముని భీతుడౌ నంబరీషుని యార్త
నాదంబు మున్ను విన్నావుగావా
బహు బాధితుండైన ప్రహ్లాదునకును ము
న్నీవు ప్రత్యక్షమైనావు కావా
తే. నాటి మది నేడొ కరుణనన్ గనవు వినవు
రావు ప్రోవవు వేగపురాణ పురుష
తాత తాతవు ముది మదిఁదప్పినావా ॥వైరి॥ 26

సీ. గ్రామంబులన్నియుఁ గాల్చి దీపారాధ
నలు చేసి కొర యానందముగను
వడి సాధుజనుల సర్వస్వముఁ గొని శత
గోపంబుఁ బెట్టిరి గురుతరముగ

పటఘటాదులు పోవ బ్రతిమాలువారికే
నియ్యక ఘంటవాయించి రహహ
పెద్దలకడ నుద్దుపెట్టి ప్రసాదంబు
వడ్డించి తగ పరాభవముఁ జేసి

తే. రవుర యువనార్చకులు నీకు నా పుత్రులైరి
భూసురులు సేయు పూజలు పొసగవాక్కొ
అకట ఇదియేమి పాపమునకు వెఱువవు ॥వై రి॥ 27

సీ. వాసవు పిడుగుల వానకు వెఱవవు
కడు ఫిరంగీ గుండ్ల కడల నేల
వెఱవవు భీష్మాది భీష్మ బాణాళికి
బాణాలి కేటికి భయపడంగ
దవ వహ్ని దిగమ్రింగితివిగాని జంకవీ
యభు కేల యీయరబ్బులకు నీకు
గణియింపకధిక రాక్షసుల శిక్షించి తీ
మ్లేచ్ఛుల నణుచుటే లెక్క నీకు

తే. నీకడిమి నీవెఱుంగవు గాక లోక
కర్తవగు నీకొక యసాధ్య కార్యమేది
పామరులు నవ్వకుండగఁ బరులఁ దఱుము ॥వై రి॥ 28

సీ. సమధిక ప్రేమచే శబరి యెంగిలిఁ జేసి
యొసగిన పండ్లెల్ల మెసగి మెసగి
చెలగి కుచేలుండు జీర్ణ చేలంబునఁ
బొదవు ముక్కటుకులు బుక్కిబుక్కి



వనములోఁ బాంచాలి వండిన శాక భాం
డములోని బలుసాకు నమలి నమలి
పొంచి యాదుగ్గన బోయని పోటిలో
కొల్లగింజలు కొన్ని కొఱికి కొఱికి

తే. పొందితిప్పుడు భక్తుల పుణ్యమునను
భోగమో యప్ప! యీతిప్ప బోర్లపడిన
యేమిటిది మొద, వరుల యుద్వృత్తి నడఁపు ॥వై రి॥ 29

సీ. తనుదాన కౌగలించెను నిన్ను రుక్మిణి
యల సత్యయును పొలయలుక మాని
ఋణమైనఁ బాయదు జాంబవతీ దేవి
మేను మేన్గదియించె మిత్రవింద
భద్రయు భవదూరు భద్ర పీఠిక నెక్కె
వదలకుండె సుదంత వామకరము
కాళింది నిజ పాదకమల మొత్తుచునుండె
లక్షణ మెయి తీగెలాగు చెనగ

తే. రాగనోపవో! పాశ్చాత్య రాడ్బలంబు
సాధుతతిఁగొట్టి దోచగా చకితులయిరి
తుది పనికివచ్చె లే! నీకు తురకగుద్దు ॥వై రి॥ 30

సీ. తపనీయ కశిపుండు దండించు తరువాత
కాని ప్రహ్లాదుని గావలేదు
కురురాజు పాంచాలి కొప్పు పట్టీడిపిం
చిన వెన్కఁగాని రక్షింపలేదు

కరిరాజు మొసలిచేఁ గడు కష్టపడిన పి
మ్మట గాని వేంచేసి మనుపలేదు
పాండవుల్బాధలఁ బడిన యనంతరం
బునఁ గాని సిరులిచ్చి ప్రోవలేదు
తే. భక్తులిప్పుడు కొన్ని యాపదలబడక
ముందు పోషింప వల్లయా; కొందరికిని
మునుశిశువు నేడిపింపక ముద్దురాదు ॥వైరి॥ 31

సీ. జడవిప్పి జలపాలు సవరింపు మిరువంక
బలు కిటికీదారు పాగఁజుట్టు
బొట్టు నెన్నుదుటిపై బొత్తిగాఁ దుడుచుకో
పోగులూడ్పుము చెవులూడ్చ విడువు
వడిగ నంగీ యిజారొడుగు, దట్టీ జుట్టి
కైజారు దోపు డాల్కత్తి బట్టి
బీబినాంచారిని బిలిపింపు వేగమే
తురకభ్యసింపుమీ తురకభాష
తే. శక్తిలేకున్న నిట్టి వేషంబుపూను
మన్నసరి లోకవంద్యుడవైన నీవు
నీచులకును సలామ్‌సేయ నే సహింప ॥వైరి॥ 32

సీ. గోవర్ధన నగంబు గొడుగుగాబట్టిన
నాఁడు కేలున నొప్పి నాటెనొక్కొ
సరిదెబ్బలాడుచో జాంబవంతుని గ్రుద్దు
కోరకలో గుట్లు పోర నొక్కొ



నరుని సారథివైననాఁడు భీష్మునిచేతి
కలుకు టమ్ముల తొమ్ము కనిసె నొక్కొ
దుగ్గనబోయని తూపునాటిన ప్రక్క
గాయ మిప్పటికిఁ బోదాయె నొక్కొ
యొక్కట యవనరాట్పనఁ జిక్కఁ జేసి
యుక్కణఁప నెందుచేత నీవోపలేవు
పేదపుండెల్ల బయలను బెట్టవలయు ॥వైరి॥ 33

సీ. కనిపించుకోవుగా ఖలులు మార్గస్థులఁ
గొంకక ముక్కులుగోయునపుడు
అలకింపవుగదా యయ్యయో ప్రజఘోష
ధూర్తులు వడి నిల్లు దోచునపుడు
జాలిగాదామెగా చటుల తురుష్కులు
భామినులను చెరల్పట్టునపుడు
అలుకరాదామెగా యవనులు 'సత్ప్రభు'
వసుమతి మట్టుకోవచ్చినపుడు
తే. మంకుతనమేమి మాతండ్రి! మఱచినాడ
మానునే గొల్లపాల్ద్రావ మందబుద్ధి
దేవకీదేవి పాల్ద్రావ దెలివిరాదె ॥వైరి॥ 34

సీ. అలవిప్ర భార్యయూ నదితి పాల్ద్రావుట
బలియాచనావృత్తి పాదుకొనియె
క్షత్రియకన్యయూ కౌసల్య పాల్ద్రావ
రావణాదులఁ ద్రుంచి ప్రబలినావు

గొల్లయౌ నందుని కులసతి పాల్ద్రావ
బసులఁ గాచెడి బుద్ధి పట్టువడియె
నిసుమంత విసపు రక్కసిపాలు చవిచూడఁ
గాబోలు మాపట్ల కఠినవృత్తి

తే. పాలకాగ్రణివైన గోపాలబాల!
పాలబుద్ధులు మాని మాపాలఁగలిగి
పాలన మొనర్పవయ్య కృపాలవాల! ॥వైరి॥

సీ. 'బేగీ అరే అరబ్బి పడోరే' యని
బోడి సన్న్యాసులఁ బొడుచువారు
'మత్రఖో మూపరుమాటి' యనుచు వైష్ణ
వుల బొట్లు దుడువగఁ బోవువారు
'పత్తరు కాయకు బందియారే చోడు
దేవ' ని శైవులఁ దిట్టువారు
'కాల, టీకా తూ నికాల్దేవ' టంచు మా
ధ్వులఁ బ్రల్లదములాడి త్రోయువారు

తే. నగుచు యవనులు మమ్ము నిట్లడలఁజేయ
నట్టివాండ్రకు ద్విజాలెంత, యాగద, గుడి
మ్రింగువానికి లింగ మూర్బిండి వడెము ॥వైరి॥

సీ. విషవహ్ని ప్రజకెల్ల వెతఁజేయ 'కాళియు
పడగలు' వడిద్రొక్కు పటిమయేది?
వడిగ బిడౌజుండు పిడుగులు వర్షింప
శైలమెత్తిననాటి శక్తియేది?



దుర్యోధనాదులు దొరలించుకొను వేళ
విశ్వరూపముఁ జూపు వింతయేది?
ముర నరకాది ముష్కర దుష్కరాదుల
మర్దించి చెలగు నీ మహిమయేది?

తే. ఇట్లు ఖలులేచ దీనుల నెన్నటికిని
గరుణఁ జూచెదు? కలవాడు గాదెదీయు
దనుక బీదల ప్రాణముల్ తాళుబెట్లు ॥వైరి॥ 37

సీ. ఆభీరగృహముల నారగాగిన పాల
మీఁగడ ల్వడి దిగమ్రింగఁగలవు
తల్లి యిచ్చిన చల్ది తగ బ్రహ్మవచ్చిన
వెనుకఁ జూడక వేగవిసరఁగలవు
రాధికా మధురాధరామృత ధారలు
గుటుకు గుటుక్కున గ్రోలఁగలవు
భక్తులెల్లరు దిరుపణ్యారము లొసంగఁ
జెలగి లోలోన భక్షింపఁ గలవు

తే. గాని యవనులపై వడిఁ బూనలేవు
కబళమన నోరు దెఱతువు కత్తియన్న
మోము ద్రిప్పు హయగ్రీవమూర్తి వహహ ॥వైరి॥ 38

సీ. అలవిభీషణు పల్కు లాదరించిని వాడె
యతిదుష్టుడౌ రావణాసురుండు
వసుదేవ ముఖ్యుల వరబోధ వినిమెనే
దుండగీడైన కంసుండు నాఁడు

విదురాది బుధుల వివేకము ల్దెలిపినే
క్రోధాత్ముఁడైన దుర్యోధనుండు
భీష్ముఁడు లెంత చెప్పిన నిచ్చగించెనే
బాలిశుఁడగు శిశుపాలకుండు

తే. కొట్టకుండఁగ ధూర్తులవట్టి శాంతి
తాలిమేటికి తురకలు తెరిమి రాఁగ
నొడిగి చూచెదు కలిపోయె నట్లదిక్కు ॥వైరి॥ 39

సీ. నిదురించినావా నిర్నిద్ర భద్రాకార
కలిత భోగీంద్ర భోగంబుమీఁద
శయనించినావా శైశవమూర్తితో బయః
పాథోధి, పటు వటపత్రసీమఁ
బవళించినావా శ్రీ భామినీదోర్మూల
కాలంకష స్తన కుంభయుగళిఁ
జడక గావించితో భక్తసమ్రాణ్మాన
సాంకల్పితా నల్పశయ్యయందు

తే. నిబిడ పాశ్చాత్య భీతులై నిఖిల జనులు
కరిసి మొఱవెట్ట నీచెవ్లు నిదురపట్టె!
లెమ్ము నాసామి! జాగేమి చిమ్ము రిపుల ॥వైరి॥ 40

సీ. నిను బూజగావింప ఘనవిప్రులేటికిఁ
గొదువగాకుండ సయ్యదులె కలరు;
వినుతింప శాస్త్రజ్ఞవిద్వాంసులేటికి
పీలు గావించు మౌల్వీలె కలరు;



ఆత్మకీర్తన సేయ హరిభక్తులేటికి
గేకలు వేయు పకీర్లె కలరు;
పూతాత్ములగు ననుష్ఠాతలు నీకేల
తెలుచుగా పీరుజాదాలె కలరు

తే. వట్టి యాసల నిటు మోసపట్టి త్రోయ
చూరు పట్టుక వ్రేలాడి నారటిట్టి
ముచ్చటకె నీవు శక్తిహీన ముఖుఁడవౌట ॥వైరి॥ 41

సీ. జయ విజయీభవ, జగదవనాసక్త!
జయ విజయీభవ, శౌర్యయుక్త!
జయ విజయీభవ, శాశ్వతకల్యాణ!
జయ విజయీభవ, నయధురీణ!
జయ విజయీభవ, సర్వంకషప్రజ్ఞ!
జయ విజయీభవ సన్మనోజ్ఞ!
జయ విజయీభవ సాధుజనాధార!
జయ విజయీభవ భయవిదూర!

తే. యనుచు జయవాక్యముల జనుల్వినుతి సేయఁ
జక్రహస్తుఁడవై రిపుక్షయ మొనర్చి
ధరణిఁ బాలింపు మాచంద్ర తారకముగ ॥వైరి॥ 42

సీ. చాటకపోఁజుమీ చాలఁబ్రోవక యున్న
నాటి వ్రేపల్లెలో తోటిమాట
ప్రకటింతుఁజుమీ నమ్మి రక్షింపకుండినఁ
దగ గొల్లచెలుల వస్త్రములమాట

దాచనుజుని మమ్ము దరిఁ జేర్చకుండిన
గొంకక మథురలో కుబ్జమాట
పైట బెట్టెదఁ జామీ పాలింపకుండిన
గాలయవనునాటి కానిమాట

తే. మర్మమెరిగిన వారితో మానువాదు
పైసి పోగొట్టుకోకు మాపాలగలిగి
సాధురక్షణ దుష్టశిక్షణ మొనర్పు ॥వైరి॥ 43

సీ. ఖలవధార్థమునందు నిలయ మొందితివంటి
నలవెన్న దొంగిలి తినుటలేదు
లక్ష్మిప్రియా రుక్మిణీలలనఁ గూడితివంటి
నలరాధ మరగితివనుటలేదు
అవనిఁ బాలింపగా నవతరించితివంటి
పశుపాలకుఁడవని పలుకలేదు
దుష్టులౌరాజదైత్యుల హరించితివంటి
నల నరసారథి వనుటలేదు

తే. అయ్యా! మొదగాడ నామాటలనకమున్నె
ఖలుల వధియించి నీసిగ్గు నిలుపుకొమ్ము
పరులు నవ్వఁగ నపకీర్తి పాలుగాక ॥వైరి॥ 44

సీ. గ్రామదాహక కర్మగతి మానుపుమటన్న
వెన నదే మఱియుఁ గావించె దీవు
పథికుల దోఁచించు పగమానుపు మటన్న
వెన నదే మఱియుఁ గావించెదీవు



చెఱలుఁ జూఱలుఁ బట్టుసేగి మాన్పుమటన్న
వెన నదే మఱియుఁ గావించెదీవు
బహుసస్య నాశనార్భటి మానుపుమటన్న
వెన నదే మఱియుఁ గావించెదీవు

తే. వేడుకొనుకొద్ది లావాయె వెఱ్ఱివాడ
మోడముంచకు మనకీర్తి యొనరెమాకు
బుద్ధిఁ దెమ్ముకో యవనుల పొంకమణఁచు ॥వైరి॥ 45

సీ. మామిడీ చిగురు సొంపేమి లక్ష్యంబన
కరచరణాంబుజ కాంతివెలుగఁ
గలకలనవ్వు చక్కనిముద్దు నెమ్మోము
పద్మసౌభాగ్యంబు పరిహసింప
వెలిదమ్మి రేకుల వెలవెలఁ బోఁజేయు
సోగకన్నుల చూపు చోద్యపఱుప
నిద్దంపునునుఁ జెక్కుటద్దంబులందు నీ
మొలక నవ్వుల తేట ముద్దుగులుక

తే. నపుడు బుట్టిన పసిబిడ్డఁడనఁగఁ బాల
కడలి మఱ్ఱాకుపై బండి కరుణజగముఁ
బ్రోతువట మమ్ముగావ విప్పుడిది యేమి ॥వైరి॥ 46

సీ. పుడమిపై నడుగిడి నడువనేరనివారి
తీవ్రతఁ బరువు లెత్తించినావు
పైమీఁది దుప్పటి బరువను వారిచే
నింపైన మాట మోయించినావు

గడపదాటని కులకాంతామణుల పృథ్వి
నల్లెడఁ గలయఁ ద్రిప్పించినావు
మద్రసాకేతాన్న సంభోక్తల జన పతిం
పర జలుసాకు పాల్పరచినావు

తే. భళిర యఘటనా ఘటన ప్రభావమెల్ల
దీనజనులందె చూపితి తెలిసివచ్చె
నయ్య సామెల్ల నింటనే యన్న మాట ॥వైరి॥ 47

సీ. భవదీయముఖశోభవ బ్రాహ్మణోత్తములకా
యవనులచేత నాయాసపడుట?
భవదీయ బాహు సంభవ రాజవరులకా
మ్లేచ్ఛనాథుల గెల్వలేక యుంట ?
భవదూరు సంభవ జనులవైశ్యకోటికా
తురకలచే నిట్లు దోపుఁ బడుట ?
భవదీయపాదసంభవ శూద్రజనులకా
ని శ్రమతులా తురకల వెట్టిచేత ?

తే. మాకుఁ జెప్పకు మెట్లైన మంచిది గద
లోకకర్తకు నపకీర్తి నీకువచ్చు
వలదు నాయన్న యికనైన ఖలుల నణచు ॥వైరి॥ 48

సీ. రాఘవ మమ్ముఁ బ్రోవ రావయ్య ఖగయాన!
రాకున్న మీఁదశరథుని యాన
శీఘ్రంబు మమ్ము రక్షింపు శేషశయాన
జాగుచేసినను గౌసల్యయాన



మది కఠినతమాని మనుపుము మాయాన
మనుపకున్న వశిష్ఠమౌనియాన
పాలింపు మమ్ముని పరమసత్కృపయాన
పాలింపకున్న శ్రీభామయాన

తే. యానఁబూన సమర్థుడవఖిలజగము
నానదప్పక పోషింపుమా నతారి
తెగవుదప్పి నటింపగా ధర్మమగునె ॥వైరి॥ 49

సీ. అరులఁగొట్టక సింహాగిరి గుహాడాగిన
నవనినిన్ బిఱికివాడందురయ్య
నీవు రక్షింపక నీలాద్రి కేగిన
నవని నిన్మోండివాఁ డందురయ్య
పోషింపగాలేక శేషాద్రి కేగిన
నతిలోభివనుచు నిన్నందురయ్య
తగనాదరింప కంతర్వేది కేగిన
నత్యుగ్రుఁడంచు నిన్నందురయ్య

తే. నాథ ! ఇటు లోకనటంబొనర్చు నీకు
నహహా నిందలువచ్చు నీ వవియువిడిచి
యొద్దుకొనఁబోకు, నెనఁ బ్రోవు ముర్విజనుల ॥వైరి॥ 50

సీ. అరిసైన్యధూళి సూర్యాక్రాంతమై మించె
నిఁక నేని దయఁజూచెదీవు మమ్ము,
పరభేరి భాంకృతు ల్పగిలించె దిశల నిం
[illegible]కేమి నామొఱ వినిమెదవు నీవు

ధరశత్రుహారి ఖురదళితమయ్యె నికేమి
వచ్ఛేదనయ్య ప్రోవంగమమ్ము
వైరి తేజశ్శిఖ జ్వలియించె నింకేమి
మొగమునఁ జూచెదు జగతి జనుల

తే. నీపయికి వచ్చునప్పుడు నీవెఱుంగ
వేమి మసలకు మింక దిక్కేది మాకు
జాగరూకుండవై రిపుక్షయమొనర్పు ॥వైరి॥ 51

సీ. ప్రజలెల్ల విసికిరి పాశ్చాత్యరాట్పుమూ
భీతులై మిమ్ములఁ బిలిచిపిలిచి
జనులు వేసారిరి సమద తురుష్కుల
వెతలచే మిమ్ముల వేడివేడి
నరులెల్ల స్రుక్కిరి నానాయవనహృత
రుక్కులై మిమ్ముల మ్రొక్కిమ్రొక్కి
ప్రాణిసంతతి భంగపడియె ఖానులుసేయు
దరిలేని వెతమిమ్ముఁ దలఁచి తలఁచి

తే. ఇందుఁగలఁడందులేడను సందియంబుఁ
జెందవల దన వేద వాగ్బృందమెల్ల;
నెందు వెదకినఁ గానరావేమి యిపుడు ॥వైరి॥ 53

సీ. బహుఫణాదీప్తుడౌ ఫణిరాజుపైఁ బండి
గాలివారకయుండఁ గాచెదీవు
వరగరుద్విస్ఫురద్గరుడునిపైఁ జెంది
చిరసుఖగతుల రక్షించెదీవు



వేత్రాధిగత జగద్వితతి విష్వక్సేను
దరిఁజేర్చి బిలయుక్తిఁ దనిపెదీవు
ఘనభుజాబలవంతు హనుమంతు నెదఁజేరి
మెలమి బ్రహ్మానందమిచ్చె దీవు.

తే. పొసఁగ నీరీతిఁ దలపోయ పొడుగుచేతి
వాని పర్యాయమాయెగా దీనపాల
పృథుబిరుదలీల యేమూలఁ బెట్టినావు ॥వైరి॥ 53

సీ. మా మొఖాసాకు గ్రామంబు లిమ్మనలేదు
కొంపలు గాల్పింపకూడదంటి
గరిహయాదుల మేము గాంక్షింపఁగాలేదు
గో వధమాన్పించి ప్రోవుమంటి
మాకు మిమ్ములను సామ్రాజ్యమిమ్మనలేదు
జనులను దోఁపింపఁ జనదటంటి
స్వామి మాకొఱకేమి కామింపగాలేదు
క్షితిలోనఁ బ్రజల రక్షింపుమంటిఁ

తే. జెలగి నీపదసేవలు సేయుమాకు
వేతకోరిక లేటికి వెన్నగలుగ
నహహ నేతికి నేటికి నంగలార్చ ॥వైరి॥ 54

సీ. భక్తసంరక్ష! కృపాపర! జలజాక్ష
నరహరి! గోవింద! హరి! ముకుంద!
సంసార తారక! సజ్జనాధారక!
సత్యసంకల్ప! శేషాహితల్ప!

నీలాంబుదశ్యామ! నిఖిలదైవలలామ!
సర్వపాప వినాశ! జగదధీశ!
శ్రీ రమానాయక! శ్రితఫలదాయక!
శృంగార దరహాస! చిద్విలాస!

తే. భవదచలపాద గతులైరి యవనులయయొ
అలుకమానక తురుము వాండ్రందఱికయు
నందగాకుండిసఁ గాల్బట్టు కొందురయ్య ॥వైరి॥ 55

సీ. దశకంఠకంఠ మర్దన దుర్దమాటోప
రామనామక మా ఫిరంగిదెబ్బ
తతమేఘనాధ భేదక మోద లక్ష్మణ
ప్రకటనామక మా ఫిరంగిదెబ్బ
ఘోరహిరణ్యాక్ష శిక్షకరూక్ష నిజనృహ
ర్యక్షనామక మా ఫిరంగిదెబ్బ
కుంభినీ భరణ విజృంభణ శ్రీకూర్మ
రమ్య నామక మా ఫిరంగిదెబ్బ

తే. తగిలి వచ్చియుఁ జావక ధరణిఁ దిరిగె
యవనబలము సుదర్శనాహత మహోగ్ర
రాహువననట్లు గాకుండ రహిఁజయింపు ॥వైరి॥ 56

సీ. గ్రామముల్ నిర్ధూమ ధామమ్ములాయెను
సస్యంబులెల్ల నాశనముఁజెందె
దొడ్లలో శాకముల్ దుంపశుద్ధిగఁ బోయె
దోచిరి సర్వంబు గోచిదక్క



చెట్టొకపిట్టయై చెదరిరి దిక్కులఁ
బలు వెతఁ బడరాని పాట్లుబడిరి
యన్నమందఱకును నమృతోపమంబయ్యె
వరుసగా నటమీద నానలేదు

తే. ప్రజల పసతీరె, నిక మొదల్వదిలమయ్యె
దరిదరికి వచ్చెనిదె మెండు తురకదండు
చిత్తమునఁ జూచుకోవయ్య శీఘ్రబుద్ధి ॥వైరి॥ 57

సీ. శ్రీదేవి మతి తనుఁజేరరా నీదని
భూదేవి వదలక పొదివె ననగ
మోక్షధనంబని మునులు మహాపేటి
చేతి నిక్షేపంబుఁ జేసిరనగ
భక్తాగ్రగణ్యుఁడౌ బలిపూజసేయఁగా
బలిసద్మముననుండి వెలసెననగ
బ్రహ్మాది హృదయ సారసములతోడ దా
గుడుమూత లాడుచుండెను ననంగ

తే. ధరణి గుప్తములయిన పాదములతోడ
బాతిపోలేవు నీకేది బ్రతుకు త్రోవ
పౌరుషము చాలదు తురుష్కబలముఁ ద్రుంప ॥వై॥ 58

సీ. నిఖల విశ్వంబును నీయందణఁగియుండు
విశ్వంబులో నీవు వెలసినావు
విశ్వరూపకుఁడవు విశ్వమయుండవు
విశ్వసాక్షివి విశ్వవిభుఁడవీవు

విశ్వసర్గస్థితి విదళనకరుడవు
విశ్వంబునకు నీవు వేరుకాదు
కినుక విశ్వద్రోహ మొనరించు దుష్టుల
శిక్షించి ప్రజల రక్షింపవేమి

తే. ఇంతబతిమాల మాకేల యెట్టులైన
గాని శుభకంద! కందకులేని దూల
బచ్చలికి నేలగల్గునో పరమ పురుష ॥వైరి॥ 59

సీ॥ ఉరమున శ్రీదేవి యొఱపైన మెఱుపుగా
గంభీర వాగ్ధార గర్జితముగ
హారమౌక్తిక కళలల వడగండ్లు గా
భ్రూలత హరిచాపలీల మెరయ
కోరిక భక్తమయూరముల్ నటియింప
దీన చాతక పంక్తితృప్తిఁ జెంద
తనవదన ప్రభ దశదిశల్ నిండగా
పృథివీస్థలిని కృపావృష్టినించి

తే. సత్ప్రజాసస్య సంరక్ష సలుపనిదియె
సమయమోయయ్య ఇకమాను జాగుసేయ
నన్నుఁ గన్నయ్య రక్షింపు నల్లనయ్య ॥వైరి॥ 60

సీ. నిడుదకడాని శాల్నదుమున బిగియించి
తీరైన గండపెండేరమూని
రమణీయమణి శిరస్త్రాణ మౌదలఁబూని
స్ఫుటవజ్రమయమైన జోడుదొడిగి



తూణంబులిరువంక తోరణంబుగఁగట్టి
విలసిత శరమైన విల్లుబట్టి
పరవైరి హరమైన తరవారి ధరియించి
దాపల చికిలి కటారి చెక్కి

తే. రామవేషంబుతో సుమిత్రాసుతుండు
నీవురణరంగమున నిల్చి నిబిడశత్రు
జాలముల నేల పాల్సేయులీల నెఱపు ॥వైరి॥ 61

సీ. గాధేయయజ్ఞ విఘ్న కరాసురావళి
జక్కుఁ జేసినయట్టి శౌర్యనిధివి
వరవీర భీకర పరశురాముని పరా
క్రమము బెండుగఁజేయు ఘన భుజుఁడవు
పదునాల్గువేల దుర్మద రాక్షసులతోడ
ఖరుని మర్దించిన వరబలుఁడవు
బంతులాడినరీతి పంక్తికంఠుని తల
ల్ఖండించు చండప్రచండరుచివి

తే. నీకునొక దొడ్డకార్యంబె నీచయవన
సేన నిర్జించుపని ప్రజల్చేసికొనిన
కర్మమున నీదు చిత్తంబు కరఁగదాయె ॥వైరి॥

సీ. కోటి సూర్యోజ్జ్వలత్ కోటీరమణులతో
రమణీయమణి కుండలములతోడ
శంఖచక్రగదాసి శార్ఙ్గాయుధములతోఁ
బ్రస్తుతప్రభ, కౌస్తుభంబుతోడ

వల్లి పెబంగరు వల్వ వలెవాటు నీటుతోఁ
బొక్కిలి తామరపువ్వుతోడ
గంగనుగన్న చక్కని పదాబ్జములతో
మిసిమిచామన చాయ మేనితోడఁ
బక్కి గుఱ్ఱంబుమీదను నెక్కినాడు
మ్రొక్కఁగైకొని కోర్కెంబు లిక్కటిల్ల
నొక్కట యనరాక్ష్వనజుక్కసేయు ॥వైరి॥ 63

సీ. దండంబు నీకు నుద్దండ తేజశ్చండ
జోహారు భక్త దుర్మోహ నాశ
మ్రొక్కెదఁగొను జలముక్కాయరు క్కాంత
వందనంబిదె చిదానంద కంద
నతిఁజేతు శతధృతిస్తుతి యుతోన్నత చర్య
ప్రణుతిఁ జేసెద ముని ప్రణుత చరణ
సాష్టాంగ మిదె నీకు సాష్టా పదాంబర
కేలు మోడ్చెద జగత్కేళిలోల

తే. వలదు వలదు పరాకు భావమ్ము నీకు
దీనజనములఁ గృపఁబ్రోవ దిక్కునీవ
దుష్టుల వధించి పోషింపు శిష్టజనుల ॥వైరి॥ 64

సీ. గరుడా చలంబుపైఁ గడకతో వసియించి,
సత్యభామా తటిచ్ఛాయ నలరి,
వరచాప మనియెడి హరిచాప మమరించి,
వివిధ భక్తులఁ గృపావృష్టి ముంచి,



అమర మయూర వారము మోద మందించి,
దీన చాతకములఁ దృప్తినించి
క్షేత్ర కన్యాకామ సస్యముల్పండించి
జగములు చల్లనై నిగడఁ జేసి

తే. నవఘన స్ఫూర్తిచే మురనరకధేను,
ఖరదవానల మార్చిన కడక నిపుడు
రిపుల శిక్షించి రక్షించు పృథివి జనుల ॥వైరి॥ 65

సీ. నీ పాదరజమున నిమిషంబు లోపల
బాపురే సతియయ్యె చాపరాయి
నీ బాహు బలమున నిలువక ఫెళ్ళున
ముక్కంటి చాపంబు ముక్కలయ్యె
నీ యాజ్ఞచే గిరుల్ నీటఁ దేప్పనఁ దేలె
కడకు సముద్రంబు గట్టువడియె
నీ ప్రతాపాగ్నిచే నిఖల రాక్షస కోటి
మాడి దోమల పోల్కి మడిసి పోయె

తే. బాగులే! యిట్టి నేరవైన ప్రాపు గల్గి
యల్పులకు లొంగి తిరుగ లేమయ్య మేము
కర్మమా మాకు గజమెక్కి కంతదూర ॥వైరి॥ 66

సీ. మున్ను తాటక ప్రాణముల్గొన్న బాణంబు
మెఱసి సుబాహుఁ దున్మిన విశిఖము
మించి విరాధు ఖండించిన ప్రదరంబు
ఖర దూషణాది సంహరణ శరము

మాయల మారీచు మదమణంచిన తూపు
ఘోర కబంధుని గూల్చు చిలుకు
వాలి మహాబలశాలిఁ గూల్చిన కోల
జలధి నింకించిన సాయకంబు

తే. రావణాది మహాసురరాజి నణఁచు
చండ కాండంబు లేమాయెఁ? జటులయవన
ఖండనము సేయ నయ్యంబకములఁ బఱవు ॥వైరి॥ 67

11.
సీ. ఖల హిరణ్యాక్ష ముఖ్యుల నెల్ల ఖండించి
దేవతాతతిఁ బ్రోచు దివ్యమహిమ
రావణ కుంభకర్ణ ప్రముఖుల నెల్లఁ
గొట్టి మానులఁ బ్రోచు దిట్టతనము
శిశుపాలకాది దుశ్శీలురఁ బరిమార్చి
క్షితి దీనజనుల రక్షించు కడక
కంసాది దుష్ట విధ్వంసనం బొనరించి
ధరణిపాలించు నుదారకరుణ

తే. వినుటయేకాని కన్నులఁ గనుటలేదు
కంటి మిప్పుడు యవనుల గర్వమణఁచి
ప్రజల రక్షించు నీదు ప్రభావమెల్ల ॥వైరి॥ 68

* సీ. కారుణ్య దృష్టిచే గని మమ్ము రక్షింప
నీరజేక్షణ నేడు నీవు పంపఁ
బారసీకుల దండుపైఁ గొండలోనుండి
గండు తుమ్మెదలు నుద్దండలీలఁ



గల్పాంతమున మిన్ను గప్పి భీకరమైన
కాఱుమేఘంబులు గలసినట్లు
దాకి భోరున రక్తధారలు గురియగా
గఱచి నెత్తురు పీల్చి కండలెల్ల

తే. నూడిపడ నుక్కుమూతుల వాడి మెఱసి
చించి చెండాడి వధియించెఁ జిత్రముగను
నొక్కొకని చుట్టుముట్టి బల్ నిక్కుటముగ ॥వైరి॥ 69

## ప ద్య గీ త ము

అరులఁబరిమార్చి వైశాఖపుర సమీప
గిరిబిలంబున డాగె బంభరములెల్ల
అది మొదలె తుమ్మెదల మెట్టయంద్రు దాని
వైరి హరరంహా! సింహాద్రి నారసింహా?॥ 70

సీ. జయమాయె యవనరాట్సంతమసముబాపె
భవదీయ భాస్వత్ప్రభా బలమున
భువన జాతంబులు పొలుపుచేఁ జెన్నొందె
దిక్చక్రములు చాల తెలివి నొందె
కమలజాదుల నుతుల్గణన సేయని నీవు
లీల నా మనవి చెల్లించినావు
బ్రహ్మాండభాండ సంభరణ లీలాఘను
నిల నిన్ను మెచ్చియేమియ్య గలను

తే. తోచదిక నెట్టు, లిదె నాకుఁదోచినట్లు
తులసిదళ మొక్కటిత్తు సంతోషమొందు
మదియె యగణిత పూజగా నవధరింపు ॥వైరి॥ 71

సీ. అపరాధి నపరాధి నార్తరక్షణ దక్ష
యపరాధి నపరాధి నంబుజాక్ష
యపరాధి నపరాధి నద్భుత గుణధుర్య
యపరాధి నపరాధి నధిక శౌర్య!
యపరాధి నపరాధి నంభోధి గంభీర
యపరాధి నపరాధి నత్యుదార
యపరాధి నపరాధి నానంద పరిపూర్ణ
యపరాధి నపరాధి నభ్రవర్ణ

తే. నేర్చియైనను, మిక్కిలి నేరకైన,
నిష్ఠురోక్తులు పల్కితి నిన్ను, నాదు
తప్పుసైరించి దాసుని దయఁదలంపు ॥వైరి॥

సీ. వీరాధి వీరుఁడవై రాజిలెదు నిన్నుఁ
బిఱికి వాఁడంటిని భీతిలేక
జగదేక వితరణాశ్రయ మూర్తివగు నిన్ను
బహులోభివనుచును పలికినాఁడ
పరిపూర్ణ కరుణాస్వభావుండవగు నిన్ను
నిర్దయుండంచు నిందించినాఁడ
నద్భుతానంద కల్యాణ గుణుండవౌ
నిన్నుఁగూర్చి పలికితి నిర్గుణుఁడని

తే. యలుక జనియించి దుష్టుల నణఁచుకొఱకుఁ
బడుచు దనమున నిటులంటి, భక్తవరద!
మదపరాధ సహస్రముల్ మదిక్షమింపు ॥వైరి॥



సీ. పరమ మోహాంధుండ పాపస్వభావుండ
దుశ్శీల పరుఁడను దుర్మనుండ
దుష్కామ యుక్తుండ దుర్మార్గ సక్తుండఁ
గ్రోధాంతరంగుండ కుటిలమతిని
లోభిని నింద్రియలోలుండఁ జపలుండ
దంభవృత్తుండ మాత్సర్య యుతుఁడ
దుష్టుండ దుస్సంగ దూష్యుండ శమదమ
హీనుఁడ శౌర్య విధాన పరుఁడ

తే. నైన శరణొందితిని నన్ను నాదరింపు
సజ్జనునకైన మిగుల దుర్జనునకైన
సౌఖ్య మొసఁగదె కల్పవృక్షంబు నీడ ॥వైరి॥

సీ. "తే నమో రక్షిత దేవతాయ, సురేంద్ర
సేవితాయ, మునీంద్ర భావితాయ,
తే నమో నిత్య సుధీరతాయ, సుమేరు
ధీర తాయ, యశుభ వారణాయ,
తే నమో నిర్జిత దీనతాయ, భృతాప్త
మానవాయ, దళిత దానవాయ,
తే నమో జ్ఞాన సుధీహితాయ, స్మరాయు
తాకృతాయ, బుధోరరీ కృతాయ,

తే. పాహిమాం పాహిమా మన్యథాహి నాస్తి
శరణ మరుణాబ్జ దృక్కోణ కరుణ" అనుచు
వందనముచేసి కొలుతు భావమున నిన్ను ॥వైరి॥

సీ. స్నాన సంధ్యానుష్ఠాన శక్తుఁడగాను
పరమ యోగాభ్యాస పరుఁడగాను
విమల దివ్యక్షేత్ర గమన దక్షుఁడగాను
ఘనవరదాన సంగతుఁడఁగాను
భవదీయ పదపద్మ భక్తియుక్తుఁడఁగాను
నిరుపమజ్ఞాన మానితుఁడగాను
పరమోపకార సంభరిత చిత్తుఁడఁగాను
శమదమ సత్య నిశ్చలుఁడఁగాను

తే. వినుము దీనావన! యనాథజనుఁడ నయ్య
నేను మిక్కిలి తెలియఁగా నేరనయ్య
దేవ నిర్హేతు కృప నన్నుఁబ్రోవవయ్య ॥వైరి॥ 76 (75)

12

సీ. ధరణిగుప్తంబైన చరణయుగ్మము తోడ
నలరారు పక్కగాయంబు తోడ
రమణీయమైన వరాహాననము తోడ
ఘనతర ఫాలలోచనము తోడ
నిగనిగలాడు బల్లిదుద కీల్జడ తోడ
నవ్యగోక్షీర వర్ణంబు తోడ
మైనిండ నలదిన మంచిగంధము తోడ
నమితభక్తానుగ్రహంబు తోడ

తే. నఖిల లోకావనము సేయ నవతరించి
యున్న మిమ్ముల వినుతింప నోపలేరు
హిమకర కిరీటముఖులు నేనెంతవాడ ॥వైరి॥ 77 (76)



13

సీ. సోమకాభిఖ్య రక్షోనేత ధృతిచేత
నామ్నాయ జాతము లపహరించి
మధ్యేనదీ నాథమగ్నుఁడై దాగిన
తత్ఖలుఁ దునిమి వేదములు మఱల
ధాత కొసంగఁగాఁదలచి నీవల మత్స్య
మూర్తి వౌటను దపస్ఫూర్తి వేళఁ
దొడరి ధీవరులు సద్గుణ జాలముల నెంచి
నిలుపుదు రాత్మమందిరములందుఁ

తే. గాన నిను భక్తిరసపూర కలిత లలిత
మామకీన మనస్సరో మహితుఁ జేతు
శీఘ్రమునిష్ట మొసంగ వేం చేయు మయ్య! ॥వైరి॥ 78 (77)

సీ. చలువగా పన్నీట జలకంబు లొనరించి
విలువలేని కడాని వలువఁగట్టి
కలికి మానికములఁగులుకు గద్దియనిల్పి
తిలకంబు నొసటఁ జెన్నలర దిద్ది
కలపంబు మైనిండ నలది బల్మగరాల
తళతళలాడు సొమ్ములు ధరించి
యలరు నెత్తావిదండలు ఏలుగా వేసి
కవితరసాన్న మింపొలయఁ బెట్టి

తే. విడెమిడి పదమ్ములొత్తెద వేడ్కతోడఁ
బవ్వళింపుము మన్మనః పద్మశయ్య
"నలరిపుల నెల్ల మర్దించి యలసినావు" ॥వైరి॥ 79 (78)

సీ. భువనము లుక్కుక్షిలోఁ బూని రక్షింతువా
భువనంబులో నిక్కముగఁ జరింతు;
పరమాణురూప విభ్రాజమానుఁడవయ్యు
తామేటి రూపంబుఁ దాల్పనేర్తు
వనమున వైరాగ్య మానసుఁడవయ్యు వినోద
గతితోన మందరాగము ధరింతు
వతిసర్వరాత్ముఁడవై వెలింగియు నీవ
నంత రూపంబు ధరింతు వెప్పు

తే. జనఁగలోకోపకారార్థమవతరించి
మించియా క్రియ లొనరించి మిగులఁ జెలఁగు
కూర్మనాయక! నన్నేలు కొనఁగదయ్య ॥వై రి॥ ౮౦

సీ. అతి తిగ్మరుచి మండలాక్షి యుగ్మచ్ఛాయ
వ(మ)లయాద్రి దావాగ్నివలె వెలుంగ,
రిక్కింప తను రుహ శ్రేణి గాదిన యఖం
డాళి సూచ్యగ్ర ముక్తాంచితముగ,
గురుదిశా భేదక ఘుర్జుర ధ్వనిక్షయ
స్తనయిత్ను గర్జకుంజదువు చెప్ప,
పదఘట్టనలఁ జిమ్ము ప్రళయోదకము నభ
స్థలము నామ్రేడి తక్షరముఁ జేయ

తే. కిటితనువుతో హిరణ్యాక్షు గీటణంచి
క్షమ ధరించితి చర్వణ సమయులగ్న
మేఘ శకలంబు గతి దంష్ట్రమీఁద నడర ॥వై రి॥ ౮౧



సీ. నతిఁ జేతునిదె నీకు నాసికా నిస్సృత
జంఝానిలోద్ధూత శైల జాత!
వందనం బిదె నీకుఁ బ్రహ్లాద శుకపరా
శరధీర హృదయ గహ్వర విహార!
సాష్టాంగమిదె నీకు స్వర్భాను హిమధామ
జేతృ ప్రతాప నృసింహ రూప
మ్రొక్కెద నిదె నీకు క్రూరసంహారక!
సాగరపూరకోదార కరుణ

తే. పాలన మొనర్చు నఖర కుద్దాల దళిత
కనక కశిపు దానవ ఘన తను విదళన
జాతకీలాల పరితృప్త భూత నివహ! ॥వై రి॥ ౮౨

సీ. దేవతాతతి కోర్కెఁ దీర్పఁగా సమకట్టి
జనక తార్ధికిఁ గశ్యపునకుఁ బుట్టి
యుదుటుగా నుదుట మృదూర్ధ్వ పుండ్రముఁ బెట్టి
కింశుక దండంబుఁ గేల బట్టి
పసపు నిగ్గులు దేరు పచ్చ గోచియుఁ గట్టి
మధ్యస్థలంబున మౌంజిఁ జుట్టి
వర్ణనీయ ద్విజవర్ణివై పాడకట్టి
బాలార్క శతతతాభఁగనుపట్టి

తే. ధరణి గగనము రెండు పాదముల మట్టి
మఱి తృతీయాంఘ్రి నబ్బలి మట్టు నట్టి
వామనా! ప్రేమనా మన స్సీమనుండు ॥వై రి॥ ౮౩

18.

సీ. కార్తవీర్యార్జున కరచయారణ్యంబు
దారుణాగ్ర కుఠార ధారఁదునిమి
చిరతర క్షత్రియ క్షేత్రముల్ సొంపుగా
భీమేషు హలములఁ జెగడదున్ని
తన్నృప మస్తక తతులు గుట్టలు వైచి
మిగుల చిత్రంబుగా మెట్లు గట్టి
తత్తను కీలాల ధారా సరిత్తుల
నవనవంబులుగఁ గాలువలు దిద్ది

తే. ఘన యశస్సస్య మవని యాకసము నిండఁ
బ్రబలచేసితి వౌ, భళి ! పాదుకొనియె
భావిహలమూర్తి ! పరశు రామావతార ॥వైరి॥ 84 (83)

19

సీ. మనువంశభూషణ! మహిమచేఁ జెన్నొంది
ఘన కళాసాంగత్య కలనఁ జెంది
సకల సాయక వర్ణ సంగతినింపొంది
సద్గుణరీతి ప్రశస్తినొంది
అస్త్రాసపటల లీలాత్మతఁ జెలువొంది
నిర్దోషగతులచే నెరవుఁ జెంది
సకల జగన్నుత సంపదఁ జెన్నొంది
సుకుమార రత్న సంశుద్ధినొంది

తే. సరసదశరథపత్ని కౌసల్యగర్భ
మనెడు గనియందు హరి నీల మన జనించి
రామ సంజ్ఞ మెలంగుననిన్ బ్రస్తుతింతు ॥వైరి॥ 85 (84)



సీ. ఫణిరాజు శయ్యపై బవ్వళించెడు నీవు
పండితి కౌసల్య ప్రక్కలోన
బ్రహ్మాండ గోళముల్ ప్రాకి యాడెడు నీవు
రహిఁ బ్రాకితివి దశరథుని యింట
బహు వేదశాస్త్ర ప్రభావుండవౌ నీవు
నవ్యక్త వాక్యమ్ము లాడినావు

తే. తల్లిభాగ్యముననొ, తండ్రి తపముగతినొ,
పురజనంబుల తొల్లిటి పుణ్యముననొ,
భూవ్రతంబుననో, యిట్లు పుట్టితీవు ॥వైరి॥ 86 (85)

సీ. చిఱుత కూకటి ఘటించిన రావి రేక ము
త్యములు నెన్నొసటిపై దుముకుచుండ
నిద్దంపు చెవులఁ జెందిన పెద్ద మగఱాల
మద్దికాయల జతె ముద్దు గులుక
బులిగోరు నాటిన బలు పద్మరాగంపు
హార మక్కున తళుక్కనుచు మెరయ
గంకణధ్వని, మొలఘంటల రొదయు, కిం
కిణి రావములును, నేకీభవింప

తే. భరత లక్ష్మణ శత్రుఘ్న బాలకేళిఁ
దనరుననుఁ గన్న తలిదండ్రు లనఘులెన్న,
చిన్నిరామన్న ! నన్ను రక్షింపుమన్న ! ॥వైరి॥ 87 (86)

సీ. రత్నకీలిత తనుత్రాణంబు ధరియించి
కస్తూరికా తిలకంబు దిద్ది
బాణాసన, సబాణ, తూణీరమును దాల్చి
యందంపు జాతిరా గంధమలఁది

మొసలి నా నెరబాకు మొలఁ జక్కఁగా, జెక్కి
కలికి బంగరు రంగు కాసెగట్టి
ఢీకరంబుగ గండపెండేరములు బూని
నవరత్నమయ భూషణములు దాల్చి

తే. వీర శృంగార రసములు వెలయ నీవు
కౌశికునితోఁ జనుట - తాటకావధంబు
నలిపి జానకిఁ బెండ్లాడఁ దలఁచియె కద ! ॥వై రి॥

సీ. శిలదాసి నప్పుడె - చికురభావములోఁచె
పదపద్మకలిత షట్పదము లనఁగ
నడుగిడినప్పుడె — యాననం బేర్పడె
నఖతార గతనిశానాథుఁ డనఁగ
నంజవేయఁ - గుచద్వయముగను పట్టెను
రతియుక్త కోక దంపతు లనఁదగి
కలయఁగ్రుమ్మరువేళ గాంతి యయ్యెఁ దనూజ
నొసఁగ నల్లసి జూచు నవ్వి యనఁగ

తే. సంతఁగౌతము సతివ యహల్య యగుచు
నతిధి సత్కారములు సల్పెనట త్వదంఘ్రి
రజము నతిసేయఁదరమె శ్రీరామ చంద్ర ! ॥వై రి॥

సీ. జనక రాజన్య సంసన్మధ్యమున నుండి
గొబ్బునలేచి, వై నిబ్బరముగ
మణి, లసత్కంకణ మంజు — ధ్వనులచేత
రాజన్యమనములు రగులఁజేసి



సామిలంబుగ కంఠసరములు దాలిచి
యీశ్వరచాపంబు నెత్తి, హస్తి
హస్తాగ్రమున బిసమ్మువలీలఁ గొనులీలఁ
గొని నారిదివియ ఫెళ్ళునను విఱిగె

తే. విఱిగె రాఘవ తద్ధ్వనిఁ దరులు, గిరులు ;
విఱిగె నృపతుల మనములు ; విఱిగె రిపుల
నడుము ఫెళ్ళున ; నీ భుజోన్నత్యగరిమ ॥వై రి॥

సీ. కనక శలాక, శృంగార తరంగంబు,
రాజమరాళి, సామ్రాజ్యలక్ష్మి,
మదనబాణము, నవమాలిక, మాణిక్య
వల్లరి, చంచలావల్లి చంద్ర
కళ, ధగద్ధగిత నక్షత్రంబు, నవరత్న
మంజరి, కందర్ప మదగజంబు,
లావణ్య సరసి, విలాస పేటిక, మనో
జవనవాటిక, ఘనసార ఘుటిక,

తే. జాతరూప సమేత, భూజాత, జనక
జాత, దృగ్జిత నవ వన జాత సీతఁ
బరిణయంబగు నీమూర్తిఁ బ్రస్తుతింతు ॥వై రి॥

సీ. కల్యాణ వేదిక కౌతుకంబులు దాల్చి
యందపు మై గంధమలఁది ప్రేమ
తెరవైచి బాసవాల్ తెరవలు దీపింప
లోలోనఁ జూచు మేల్జూపు సొగసు

తోరంపు ముత్యాలు దోసిళ్ళఁ గీలించి
  తలఁబ్రాలు పోయు బిత్తరపు కోపు
మంగళసూత్ర సంబంధ వేళానోన్య
  పులకిత స్విన్నాంగముల మెఱుంగు

తే. చెట్టపట్టులతో నల సీత నీవు
గురువులకు వందనముసేయు కూర్మిభక్తి
రంగు మీఱంగ మిథిలాపురంబు నందుఁ
జూచుపుణ్యాత్ము లే నోము నోచిరో
భద్రయుతకీర్తి! శ్రీరామభద్రమూర్తి! ॥వైరి॥ 91

సీ. తమ్ములు నీవు నందమ్ములతోఁ బెండ్లి
  కొడుకులై సతులతోఁ గూడి చనుచుఁ
పరశురాముని భంగపఱచి, యయోధ్య పు
  రంబు వైభవము మీఱంగఁ జేరి,
కోరికల్మీఱఁగా కొన్నాళ్ళు వసియింప
  దశరథేశుఁడు మీకు ధర్మనియతి
యువరాజ్య పట్టణోద్యోగంబుఁ గావింప
  కదుఁ జూడఁ జాలక కైక మిమ్ము

తే. సకలలోకైక నిందకు జడియ కకట
యడవులకు నేగుమనగ నోరాడెనెట్లు
కైక ననేల? నీదు సంకల్ప మట్లు ॥వైరి॥ 92

సీ. అంటినఁగందెడు నడుగు దమ్ములతోడ
  నడవి జానకి యెట్లు నడచెనయ్య!
పుడమి యేలుటమాని జడదారులగు మిమ్ము
  తల్లి గన్గొని యెట్లు తాళెనయ్య!



యనుఁగుఁ దమ్ముఁడు సుమిత్రాత్మజుండొక డెట్లు
  మిముగొల్చు వ్రతహాని మెలఁగెనయ్య?
నీదుపావలు రాజ్యనేతలుగాఁ గొల్చె
  భరతు డక్కట! యెంత భక్తుడయ్య!

తే. చిత్రకూటాద్రిఁ గడుతప్పుచేసినట్టి
చెడుగు కాకము మఱల రక్షించినావు
రామ! నీ వెంత కరుణాంబు రాశివయ్య! ॥వైరి॥ 93

సీ. దండకారణ్య దైత్యావళిఁ బరిమార్చి
  సాపరాధు విరాధు రూపుమాపి
మునుహేతి జప్పనాతిని విరూపిని జేసి
  ఖరకృత్యు ఖరదైత్యు ఖండణంచి
మాయావి నీచుని మారీచుఁ బరిమార్చి
  దుర్మదాంధుని గబంధుని వధించి
తతవక్రశీలము ల్తాళముల్ ఖండించి
  వాలి దోర్బలశాలిఁ గూలనేసి

తే. తోడరి సుగ్రీవ హనుమ దాదులను గూడి
వనధి గర్వమడంచి రావణునిద్రుంచి
ఘన విజయమొందు వీరరాఘవుఁడ వీవు ॥వైరి॥ 94

సీ. శాశ్వతంబుగ విభీషణునకు లంక ని-
  శ్చల కృప నొసగుటఁ దలచుకొన్న
చెఱఁబడ్డ సురసిద్ధ గరుడ గంధర్వ కాం-
  తల విడిపించుటఁ దలఁచుకొన్న

నిఖిల లోకంబులు నిష్కంటకములుగా
నలరఁ బ్రోచిన వింతఁ దలఁచుకొన్నఁ
గొలిచినవారికిఁ గొంగు బంగారమై
తగుకోర్కె లిచ్చుటఁ దలఁచుకొన్న

తే. ముదముగొన్న ధరాసుత ముద్దరాలిఁ
బరమపావని వినరాని పలుకులాడి
యగ్నిఁ జొఱఁజేయుటకె మాకునలుక పుట్టె ॥వైరి॥ ౯౬ (95)

సీ. అభినవాయోధ్యా పురాంతః పురమునందు
మిసిమి బంగరు రంగు మేడలోన
జిలుగు మేల్ రతనాల సింహాసనము మీఁద
వామాంకమున సీత ప్రేమగులుక,
హనుమంతు డగ్రంబునందు భక్తిఁ జెలంగ
ఛత్రంబు వెనుక లక్ష్మణుడు పట్ట,
భరత శత్రుఘ్నులు పార్శ్వస్థులై వీవ
వాయవ్య తటి జాంబవ ద్విభీష

తే. ణనలాంగద ముఖులు పెంపెసఁగ, మధ్య
నీలజలదాభ రుచిమీరు నిన్ను, రాము,
రమ్యగుణధాము, పట్టాభి రాముగొల్తు ॥వైరి॥ ౯౭ (96)

20
సీ. మానిత మూర్తియై మహిమచేఁ జెన్నొంది
కామ ఫాలాభిఖ్య గరిమఁ జెంది
పంక జాతంబులఁ బరిమార్చు కళమించి
[illegible]రి భయంకరగతి నధిగమించి



శుభకర ధవళాంగ శోభచే దనరారి
రేవతీ రమణాంక రీతి మీరి
సద్బలభద్ర ప్రశస్తిచేఁ జెన్నొంది
ఘనతర రామాకృతిని జెలంగి

తే. చంద్రుడన భూజ నాహ్లాద సరణి మీరు
నిన్నుఁ గొనియాడఁదరమె వాక్పతికైన
నతుల సంకర్షణ స్వరూపాభి రామ ॥వైరి॥ ౯౮ (97)

21
సీ. నీ మహామహిమ వర్ణింపగాఁ దరమౌనె
ఫణిపతికైన వాక్పతికైన
సకల లోకంబులు జననంబు నొందింప
రక్షింప శిక్షింప రాజీవ
యఖిల జగత్కంటకాకృతి నుగ్రులా
త్రిపుర రాక్షసుల మర్దించు కొఱకుఁ
దద్వధూ నికరవ్రతంబులు భంగించి
దుష్ట సంశిక్షయు, శిష్ట రక్షఁ

తే. జేయుగా బుద్ధమూర్తి ప్రసిద్ధిఁగన్న
యతుల కారుణ్యమూర్తిని న్నభినుతింతు
నీ పదంబులపై భక్తి నిలుపఁజేయు ॥వైరి॥ ౯౯ (98)

22
సీ. అయ్యారె నెమ్మోము నొయ్యారమహా బళీ!
నిక్కు వీనులు, ముక్కు చక్కఁదనము
బొర్రకై జామోర యల్లార్చు నుద్ధతి
నే బాసు రొమ్ములో జిగిబెడంగు

అన్నన్న చిత్ర తరాంఘ్రి ధారాగతి
వాహ వా సుందర బాహులీల
ఆహా సమస్త శుభావర్త విస్ఫూర్తి
బాపురే విపులమా వీపు కోపు

తే. అనుచు సకల జనుల్ చోద్యమంది పొగడ
ఘనత రాశ్వంబుపై నెక్కి కలికిమూర్తి
వగుచు పాశ్చాత్య వసులను నడచెదీవు ॥వైరి॥ 99

సీ. దేవకీసతి వసుదేవ నందనుడవై
నంద యశోదలా నంద మొంద
సమదాత్మ పూతనాశకట తృణావర్త
ధేనుక ముష్టికాదికుల ద్రుంచి
గొల్ల చేడెలవల్వ లుల్లంబులు హరించి
మామ కంసుని ద్రుంచి మధుర నలరి
రుక్మిణీ ముఖ్య సరోకేక్షణలఁ గూడి
ద్వారక వసియించి ధర్మసరణి

తే. పాండవులఁ బ్రోచి కౌరవ బలము నడఁచి
భక్తరక్షణ శిక్షఁ జేఁ బ్రబలినట్టి
కృష్ణ! గోవింద! మాధవ! కేశవ! హరి! ॥వైరి॥ 100

సీ. మాణిక్య పీఠికా మధ్య పద్మస్థితు,
రవికోటి తేజో విరాజ మానుఁ,
గంధర్వ శతకోటి సుందరా కారుని,
శంఖ చక్రగదాసి శార్ఙ్గ ధరుని,



శ్రీ, భూమి, యువతి సంశోభి పార్శ్వద్వయు,
నంచిత పుండరీ కాయ తాక్షు,
శ్రీ వత్స కౌస్తుభ శ్రీ హారయుత వక్షుఁ,
గటి లసన్మణి కాంతిఁ, గనక చేలు,

తే. మకుటకుండల కేయూర మహిత కంక
ణాంగుళీయక ముఖ్య భూషాంగు, విశ్వ
నిలయు, నారాయణస్వామి నిన్నుఁ గొలుతు ॥వైరి॥ 101

సీ. తిరుమల పెద్దింటి ధీర సంపత్కుమా
రార్య సద్వేంకటాచార్య శిష్యు
సురుచిరాప స్తంబ సూత్రు మౌద్గల్యస
గోత్రు, గోగులపాటి కులజు, గౌర
మాంబికాశ్రిత బుచ్చనా మాత్య వరపుత్రు
కూర్మ దాసాఖ్యునన్ గూర్మి నీదు
చరణదాస్య మొసంగి సంతరించితి భళీ!
యే రచించిన యట్టి యీశతకము

తే. వినినఁ జదివిన వ్రాసిన వివిధ జనుల
కాయురారోగ్య మైశ్వర్య, మతిశుభంబు,
కరుణ దయచేసి పాలింపు కమల నాథ!
వైరి హర రంహ! సింహాద్రి నారసింహ! 102

సంపూర్ణము.